1

నవతెలంగాణ

ఆదిలాబాద్

శుక్రవారం | అక్టోబర్ 06, 2023 | www.navatelangana.com

ప్రధాన రహదారులకు మరమ్మతులు చేపట్టాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూర్(టి) నియోజకవర్గంలో ప్రధాన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి ముంజం ఆనంద్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని నజ్రుల్‌నగర్ పంచాయతీ పరిధిలో పెంచికల్‌పేట్, చింతలమానెపల్లి, బెజ్జూరు మండలాలకు వెళ్లే రోడ్డు పూర్తిగా చెడిపోయి ఉండడంతో దానిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం వేలాది వాహనాలు వెళ్లే రోడ్డు దుస్థితి ఇలా ఉంటే మారుమూల గ్రామాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



గ్రామాల్లో కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లు పంపిణీ

జైపూర్ : గ్రామాల వారీగా కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేస్తున్నామని ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు. గురువారం శివ్వారం గ్రామంలో సర్పంచ్ ఆవిడపు గణేష్‌తో కలిసి యువతకు క్రికెట్, వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. బెజ్జాల గ్రామ సర్పంచ్ జయపాల్‌గౌడ్ గ్రామానికి చెందిన యువకులకు కిట్లు పంపిణీ చేశారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని, యువకులు క్రీడల్లో రాణించాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామోజీ శ్వేత, వార్డు సభ్యులు, గ్రామానికి చెందిన యువకులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దసరా కానుకగా మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తోంది. వీటిని గ్రామాల వారీగా సర్పంచుల ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్నామని ఎంపీడీఓ పేర్కొన్నారు.



ఆరు నెలల్లో సమస్య పరిష్కరిస్తా : జాన్సన్ నాయక్



నవతెలంగాణ-జన్నారం

వచ్చే ఆరు నెలల్లోపు మండల కేంద్రంలో విద్యుత్ సమస్యను పరిష్కరిస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో సబ్‌స్టేషన్ కోసం దీక్ష చేస్తున్న భూమాచారిని కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలో 132 కెవి సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ఇప్పటికే మంత్రి కేటీఆర్‌తో మాట్లాడానని, ఆరు నెలల్లో సమస్య పరిష్కరిస్తానని అన్నారు. అలాగే కవ్వాల్ టైగర్ జోన్ చెక్‌పోస్టులో తీసుకుంటున్న రుసుమును నిలిపేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాదాడి సరోజన, జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి, సర్పంచ్ జక్కు భూమేష్, కోఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్, నాయకులు ఫజల్‌ఖాన్, భరత్ కుమార్, తిరుపతి పాల్గొన్నారు.

అటవీ శాఖ ఆధ్వర్యంలో వ్యాస రచన పోటీలు



నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని ముత్యంపల్లి ఫారెస్ట్ సెక్షన్ పరిధిలో కాసిపేట ప్రభుత్వ కళాశాలలో అటవీ శాఖ అధికారులు విద్యార్థులకు 69వ జాతీయ వన్యప్రాణి సప్తలో భాగంగా పర్యావరణ సమతుల్యతలో వన్య ప్రాణుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజర్ సుభాష్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతలో అటవీ జంతువులు చాలా ప్రాముఖ్యత నిర్వహిస్తాయని, వాటిని రక్షించే బాధ్యత మన అందరిదని తెలిపారు. ఆవాసాలను అభివృద్ధి చేయడం కోసం, గడ్డి మైదానాలు, శాకాహార జంతువుల సంఖ్య పెరిగే చర్యలను చేపట్టామన్నారు. వాటి కోసం తాగు నీరు, పండ్ల చెట్లను అడవిలో పెంచుతున్నామన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ఫారెస్ట్ రేంజర్ సుభాష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జయత్‌కుమార్, డిప్యూటీ రేంజర్లు గౌరీశంకర్, ప్రవీణ్ నాయక్ పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు భూమిపూజ



నవతెలంగాణ - కౌటాల

తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో మండల కేంద్రంలో రూ.10 లక్షలతో, తలోడి గ్రామంలో రూ.10లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడానికి ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుత్తేదారులు పనుల్లో నాణ్యతలోపం లేకుండా పనులు నిర్వహించాలని, మరోసారి అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. కాసుల కోసం కక్కుర్తి పడకుండా పనుల్లో నాణ్యత గల రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. ఆయన వెంట సర్పంచ్ వొజ్జల మౌనీష్, బీఆర్ఎస్ యువజన సంఘం మండల అధ్యక్షుడు తాళ్లపెల్లి రవీందర్ గౌడ్, భిట్టుపెల్లి సంతోష్, డోంగ్రి రవి, బసార్కర్ అశోక్, రావుల ప్రకాష్, రమేష్ ఉన్నారు.

చొప్పన్‌గూడ ఏహెచ్‌ఎస్‌ను సందర్శించిన వైద్యబృందం



వాంకిడి: మండలంలోని చొప్పన్‌గూడ గ్రామ గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలను గురువారం వైద్యాధికారి వినయ్‌కుమార్ సందర్శించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. గ్రామంలో తిరుగుతూ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి వినయ్‌కుమార్, హెచ్ఈఓ రవిదాస్, హెచ్ఎ భగవాన్‌దాస్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం

వాంకిడి: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని శుక్రవారం ప్రారంభిస్తామని సర్పంచ్ బండె తుకారాం తెలిపారు. ఈ భవనాన్ని ప్రారంభించడానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జెడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి హాజరతున్నారన్నారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఉమ్మడి జిల్లా ఓటర్లు 21,81,903

- మెజార్టీ నియోజకవర్గాల్లో అతివలే ఆధిక్యం
- సిర్పూర్, ఖానాపూర్‌లో మాత్రమే పురుషులు ఎక్కువ
- తుది ఓటర్ల ముసాయిదా విడుదల చేసిన ఎన్నికల సంఘం

సార్వత్రిక ఎన్నికల సమరానికి సమయం దగ్గర పడుతోంది. ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. ఇందులో భాగంగా కీలకమైన తుది ఓటర్ల ముసాయిదా జాబితాను తాజాగా విడుదల చేసింది. ఇటీవలి వరకు అర్హులైన కొత్త ఓటర్లను నమోదు చేయించిన అధికారులు చేర్పులు..మార్పుల ప్రక్రియను పూర్తిచేశారు. తాజాగా విడుదల చేసిన జాబితా ప్రకారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 21,81,903మంది ఓటర్లు ఉన్నట్లు లెక్క తేల్చారు. వీరిలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలు ఉండగా ఇందులో ఏకంగా ఎనిమిది నియోజకవర్గాల్లో అతివల ఓట్లే ఎక్కువగా ఉన్నాయి. కేవలం సిర్పూర్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో మాత్రమే పురుషులు ఓట్లు స్వల్ప ఆధిక్యంలో ఉండటం గమనార్హం.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత ప్రాధాన్యమైనది. ఓటు ద్వారానే పాలకులను ఎన్నుకునే అవకాశాన్ని రాజ్యాంగం కల్పిస్తోంది. మరికొన్ని నెలల్లో రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు రాబోతున్న తరుణంలో అర్హులైన వారు ఓటు హక్కు కలిగి ఉండటం కీలకం. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా కీలకమైన తుది ఓటర్ల జాబితాను నియోజకవర్గాల వారీగా విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా నిర్మల్ నియోజకవర్గంలో 2.47లక్షల మంది ఉండగా ఆ తర్వాతి స్థానాల్లో ముధోల్, ఆదిలాబాద్, మంచిర్యాల నియోజకవర్గాలు ఉన్నాయి. అతి తక్కువ ఓటర్లు 1.64లక్షల మంది బెల్లంపల్లి నియోజకవర్గంలో ఉన్నారు. చెన్నూర్‌లోనూ 1.84లక్షల మంది ఓటర్లు ఉన్నట్లు తేలింది.



నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	సర్వీస్	మొత్తం
సిర్పూర్	111924	111039	10	290	223263
చెన్నూర్	91969	92141	07	133	184250
బెల్లంపల్లి	84790	84796	12	161	169759
మంచిర్యాల	131871	132292	23	333	224519
ఆసిఫాబాద్	111878	112766	17	114	224775
ఖానాపూర్	106985	110667	13	416	218081
ఆదిలాబాద్	115835	119908	05	233	235981
బోథ్	100656	106031	03	546	207236
నిర్మల్	117563	129914	18	242	247737
ముధోల్	119910	126102	18	272	246302

అతివల ఓట్లే కీలకం..!

ఉమ్మడి జిల్లాలో పురుషుల ఓట్ల కంటే మహిళల ఓట్లే అధికంగా ఉన్నాయి. రానున్న ఎన్నికలో వీరి ఓట్లే కీలకంగా మారనున్నాయి. ముఖ్యంగా చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముధోల్ నియోజకవర్గాల్లో మహిళల ఓట్లే అధికంగా ఉన్నాయి. అభ్యర్థుల గెలుపోటముల్లో వీరి ఓట్లే అత్యంత కీలకంగా మారుతాయి. మరోపక్క ఖానాపూర్, సిర్పూర్ నియోజకవర్గాల్లో మాత్రమే మహిళల కంటే పురుషుల ఓట్లు స్వల్ప ఆధిక్యంలో ఉన్నాయి. మరోపక్క కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రంలో పర్యటిస్తుండటంతో ఎన్నికల నోటిఫికేషన్ అతి త్వరలోనే విడుదల చేసే అవకాశం ఉంటుందని రాజకీయ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ఇప్పటికే ఆయా పార్టీల తరఫున పోటీ చేయబోయే ఆశావహులు ఎన్నికల బరిలో నిలిచేందుకు సంసిద్ధమవుతున్నారు. పలువురు స్వతంత్రులు కూడా ఈ సారి బరిలో నిలవాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఇప్పటికే అధికార బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించగా.. మిగితా కాంగ్రెస్, బీజేపీలు త్వరలోనే ప్రకటించే అవకాశం కనిపిస్తోంది.

సింగరేణి కార్మికులకు దసరా కానుకగా రూ.711 కోట్లు

- 16న ఉద్యోగుల ఖాతాల్లో నగదు జమ
- సింగరేణి చరిత్రలో అత్యధికంగా 32 శాతం లాభాల వాటా : సీఎండీ ఎన్. శ్రీధర్

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి కార్మికులకు దసరా కానుకగా యాజమాన్యం రూ. 711.18 కోట్ల లాభాల బోనస్ ప్రకటించింది. సీఎం కేసీఆర్ ప్రకటించిన విధంగా గతేడాది సంస్థ సాధించిన రూ.2,222.46 కోట్ల నుండి 32 శాతం లాభాల బోనస్‌గా కార్మికులకు చెల్లించనున్నట్లు సంస్థ సీఎండీ ఎన్ శ్రీధర్ తెలిపారు. సంస్థ ప్రకటించిన బోనస్ నగదును ఈ నెల 16న కార్మికుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయనున్నట్లు సంస్థ వెల్లడించింది. సంస్థ ప్రకటించిన బోనస్ ద్వారా సింగరేణి ఉద్యోగులకు సగటున ఒక్కొక్కరికి రూ.లక్షా53వేల చొప్పున బోనస్ అందనున్నట్లు సంస్థ పేర్కొంది. సింగరేణి సంస్థను లాభాల బాటలో నడిపిస్తున్న కార్మికులకు గతంలో కన్నా ఎక్కువ శాతం లాభాల వాటా ప్రకటించిన సీఎం కేసీఆర్‌కు సింగరేణి ఉద్యోగుల తరపున సీఎండీ శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు. బోనస్ చెల్లింపుకు సంబంధించి డైరెక్టర్ బలరామ్ గురువారం ఉత్తర్వులు జారీ చేస్తూ వివరాలు వెల్లడించారు. ఇతర బొగ్గు కంపెనీలలో లేనివిధంగా సింగరేణి ప్రతి ఏడాది తనకు వచ్చిన నికర లాభాల్లో కొంత శాతం వాటాను లాభాల బోనస్‌గా కార్మికులకు పంచడం జరుగుతుందని తెలిపారు.



త్వరలో దీపావళి బోనస్ కూడా

దీపావళి బోనస్‌గా చెప్పబడే(ప్రొడక్షన్ లింక్డ్ రివార్డ్ స్కీం బోనస్) పండుగకు ముందు చెల్లించడం జరుగుతుందని సీఎండీ శ్రీధర్ తెలిపారు. ఇది కూడా సుమారుగా రూ. 300 కోట్ల వరకు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. దీపావళి బోనస్ ద్వారా కార్మికులు గతేడాది పొందిన రూ.76,500 కన్నా ఎక్కువగా ఉండవచ్చని పేర్కొంటున్నారు. ఇటీవల చెల్లించిన 11వ వేజ్ బోర్డు ఏరియర్స్ రూ.1450 కోట్లలలో సగటున ఒక్కొక్క కార్మికునికి రూ.3.65లక్షలు అందాయని, ఈ లెక్కన వేజ్‌బోర్డు ఏరియర్స్, లాభాల బోనస్‌తో పాటు దీపావళి బోనస్‌తో కలిసి సగటున కార్మికులు దాదాపుగా రూ.6 లక్షల వరకు పొందే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు.

ఎన్నికలు వాయిదా కోరుతూ హైకోర్టును ఆశ్రయించిన యాజమాన్యం

జైపూర్ : సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు వాయిదా వేయాలని కోరుతూ సింగరేణి యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది. సుప్రీం కోర్టు న్యాయవాది అరవింద్ సూద్‌ను యాజమాన్యం హైదరాబాద్ రప్పించిందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. ఎన్నికలు వాయిదా వేయాలని సింగరేణిలో గల 12 సంఘాలు కోరుతున్నట్లు సుప్రీం కోర్టు న్యాయవాది గురువారం కోర్టు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో పాటు సింగరేణి ప్రాంతం మావోయిస్టు ప్రభావిత ప్రాంతం అయినందున శాంతిభద్రతల సమస్య ఏర్పడుతుందని కోర్టుకు తెలిపినట్లు పేర్కొన్నారు. యూనియన్ తరపున వాదనలు వినిపించిన న్యాయవాది విద్యాసాగర్ అన్ని కార్మిక సంఘాలు ఎన్నికలు జరిపించాలని కోరినట్లు కోర్టుకు తెలిపారు. అదేవిధంగా కార్మిక సంఘాలతో పాటు ఎన్నికల చీఫ్ లేబర్ కమిషనర్‌గా ప్రస్తుత డిప్యూటీ చీఫ్ లేబర్ ఆఫీసర్ శ్రీనివాస్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా నియమించబడినట్లు తెలిపారు. ఇది వరకే ఎన్నికల షెడ్యూల్ విడుల చేసినందున షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరిపించాలని యూనియన్ తరపు న్యాయవాది విద్యాసాగర్ వాదించినట్లు తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న తదుపరి ఈ కేసును ఈ నెల 11కు వాయిదా వేస్తున్నట్లు హైకోర్టు వెల్లడించినట్లు సీతారామయ్య తెలిపారు. ఎన్నికలు ఆపేందుకు ఎవరు ప్రయత్నించినా ఎన్నికలు ఆగవని, ముందుగా ప్రకటించినట్లుగా 6న గుర్తింపు సంఘం ఎన్నికలకు సంబంధించి ఏఐటీయూసీతో పాటు బీఎంఎస్ నామినేషన్లు వేస్తాయని పేర్కొన్నారు.

గడ్డం వెంకటస్వామి జయంతి సందర్భంగా అన్నదానం

నవతెలంగాణ-మంచిర్యాల

మాజీ కేంద్ర మంత్రి, పెద్దపెల్లి మాజీ ఎంపీ గడ్డం వెంకటస్వామి(కాకా) 94వ జయంతి సందర్భంగా సీసీసీలోని శ్రీ సాయి వృద్ధాశ్రమంలో వివేక్ యువసేన నాయకులు కేక్ కట్ చేసి అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి దళిత మోర్చా అధ్యక్షుడు సిరికొండ రాజు మాట్లాడుతూ వివేక్ యువసేన అధ్యక్షుడు మారుతి సహకారంతో అన్నదానం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో కాకా పేదలకు చేసిన సేవలను కొనియాడారు. అంతేకాకుండా గడ్డం వెంకటస్వామి ఆశయాలను కుమారుడు గడ్డం వివేకానంద(వివేక్) నాయకత్వంలో కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నస్పూర్ పట్టణ అధ్యక్షులు కొండ వెంకటేష్, యువమోర్చా నాయకులు కౌటం శేఖర్, తేజ, మార్క్షిత్, పాగిడి శివ, శ్రీరామ్, మురళీ, బిట్టు పాల్గొన్నారు.

తాండూర్ : మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి(కాకా) 94వ జయంతి సందర్భంగా మండల అధ్యక్షులు రామగౌని మహీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షులు పట్టి వెంకటక్రిష్ణ, అసెంబ్లీ కన్వీనర్ రచార్ల సంతోష్, కౌన్సిల్ సభ్యులు రెవెల్లి రాజలింగు, మండల ప్రధాన కార్యదర్శి విష్ణు కళ్యాణ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రదీప్, నాయకులు భాస్కర్ గౌడ్, వెంకటేష్, విజయ్, శ్రావణ్, బాలు, రాజనర్సు పాల్గొన్నారు.



సీఎంకు అర్చక సమాఖ్య కృతజ్ఞతలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రవ్యాప్తంగా ధూప దీప నైవేద్య పథకంలో పనిచేస్తున్న అర్చకులకు వేతనాలను రూ.10వేలకు పెంచడంతోపాటు నూతనంగా 350 ఆలయాలను పథకం పరిధిలోకి తీసుకువచ్చిన నేపథ్యంలో డిడిఎన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు గంగు సత్యనారాయణ శర్మ జిల్లా అధ్యక్షుడు శిరీష్ శర్మ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ శర్మ కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా చేర్చిన ఆలయాలతో డిడిఎన్ పథకంలో 6721 ఆలయాలు చేరాయని, నిర్ణయం అర్చకులకు ఎంతగానో మేలు చేస్తుందని పేర్కొన్నారు.

కేంద్రంలో, రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు



నవతెలంగాణ-జైపూర్

కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు అన్నారు. గురువారం మిట్టపల్లి గ్రామంలో పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. ఆరు గ్యారంటీల్లో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని తెలిపారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించిందని తెలిపారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులకు కూడా ఆర్థికంగా ఆదుకోవడం కోసం గ్యారంటీ హామీల్లో అవకాశం కల్పించిందని తెలిపారు. సొంత ఇల్లు నిర్మించుకోవడం కోసం రూ.5లక్షలు ఇస్తుందన్నారు. పింఛన్ రూ.4వేలు, రూ.10లక్షలతో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం అమలు కాబోతుందని తెలిపారు. ఈ ప్రాంతాన్ని దోచుకోవడం కోసం వచ్చిన ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను వచ్చే ఎన్నికల్లో ఓడించి ఇంటికి పంపించాలన్నారు. సింగరేణి పవర్ ప్లాంట్‌తో పాటు కాంట్రాక్టర్లను బెదిరించి సుమారుగా రూ.500 కోట్లు దోచుకున్నాడని ఆరోపించారు. ఊరికి రాకుండా కష్టాలను పట్టించుకోని ఎమ్మెల్యేను ఇంటికి పంపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా మిట్టపల్లికి చెందిన పలువురు నల్లాల ఓదెలు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

మండలంలో ఎమ్మెల్యే బిజీబిజీ



నవతెలంగాణ - మంచిర్యాల

మండలంలో గురువారం ఎమ్మెల్యే దివాకర్‌రావు బిజీబిజీగా గడిపారు. రాపల్లి ఆర్అండ్ఆర్ కాలనీలో ప్రభుత్వ పాఠశాలలో మనఊరు-మనబడి కార్యక్రమంలో భాగంగా డిఎంఎఫ్‌టి నిధుల నుండి రూ.28లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. ఇటీవల గదుల నిర్మాణాలు పూర్తి కాగా వాటిని గురువారం స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం రూ.10లక్షలతో డ్వాక్రా మహిళ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించారు. గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన చీరల పంపిణీ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చదువుకు పెద్దపీట వేస్తోందని, విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను క్రమశిక్షణతో విని భావిభారత పౌరులుగా ఎదగాలన్నారు. ప్రభుత్వ బడులపై మరింత నమ్మకం కలిగేలా తల్లిదండ్రులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మందపల్లి స్వర్ణలత శ్రీనివాస్, వైస్ ఎంపీపీ బేతు రమాదేవి, సర్పంచ్ అనే మల్లేష్, జడ్పీ కో అప్షన్ నయీమ్ పాషా, ఆత్మ చైర్మెన్ గడ్డం మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఆడపడుచులకు పండగ సారె బతుకమ్మ చీర



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆడపడుచులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పండగ సారె బతుకమ్మ చీర అని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. మండలంలోని సాలెగూడా గ్రామంలో నిర్వహించిన బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో అతి పెద్ద పండుగ అయిన బతుకమ్మకు ఆడపడుచులకు సారె అందించే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చీరల పంపిణీ కార్యక్రమం తీసుకొచ్చారని అన్నారు. పండగ ప్రతి ఒక్కరి ఇంట్లో వెలుగులు నింపాలని కోరారు. అనంతరం జాలర్లకు నిర్మించతలపెట్టిన కమ్యూనిటీ భవనానికి భూమి పూజ చేశారు. క్రీడాకారులకు క్రీడా సామాగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, ఎంపీఓ ప్రసాద్, సర్పంచ్ వినోద్, లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని గట్రావ్ పల్లి, సోనాపూర్ గ్రామ పంచాయితీలలో గురువారం ఆదివాసీ నాయకుడు ఆత్రం జంగు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గట్రావ్‌పల్లి పల్లెలో అసంపూర్తిగా ఉన్న ఉప కేంద్రం భవనాన్ని పూర్తి చేసి వైద్య సేవలను అందించాలని కోరారు. సాలెగూడెంలో మూడు రోజుల క్రితం తేడం రాజబాయి మరణించిందన్నారు. సోనాపూర్, గట్రావ్‌పల్లి, సాలెగూడెం, పెద్దాపూర్ గ్రామాల్లో చాలామంది జ్వరాలతో బాధపడుతున్నారని, వెంటనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు.

దరఖాస్తు చేసుకోవాలి

వాంకిడి : సీఈఓగా పనిచేయడానికి దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎం మహేష్ తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 9లోపు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలన్నారు. బీఎస్సీ అగ్రికల్చర్ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

కొలాంగూడలో వైద్యశిబిరం

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని భీంపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కొలాంగూడలో గురువారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించారు. దగ్గు, జలుబు, జ్వరం ఉన్న



వారికి, గర్భిణులకు ఐరన్, క్యాల్షియం మందులను పంపిణీ చేశారు. అనంతరం ఆరుగురికి మెరుగైన వైద్యం కోసం 108లో పీహెచ్‌సీ రెఫర్ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్ తెలిపారు. వైద్య శిబిరంలో సర్పంచ్ రాథోడ్ విష్ణు, ఉపసర్పంచ్ రుక్మిణి, వైద్య సిబ్బంది శ్యామక, జవహర్ లాల్, గ్రామ పటేల్ ఉన్నారు.

జోనల్ స్థాయికి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

నవతెలంగాణ-ముథోల్

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు జోనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల లక్ష్మణచాంద ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-14 కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాలకు చెందిన వినయ్, సాయి చరణ్ అనే విద్యార్థులు జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. జోనల్ స్థాయి పోటీలకు పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం పట్ల ఎంపీపీ అయేషా అఫ్రోజ్ ఖాన్, సర్పంచ్ వెంకటాపూర్ రాజేందర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. జోనల్ స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

ఆడపడుచులకు బతుకమ్మ చీరల పంపిణీ

• జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్దన్, ఎమ్మెల్సీ విఠల్



బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్, జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్

నవతెలంగాణ-ఉట్నూర్

బీఆర్ఎస్ ప్రభుత్వం ఆడపడుచులకు బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తోందని ఎమ్మెల్సీ దండె విఠల్, జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్, అన్నారు. గురువారం ఉట్నూర్ రైతు వేదికలో బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. కేసీఆర్ సీఎం అయిన తరువాత రాష్ట్రంలో సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవిస్తున్నారని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు కూడా బతుకమ్మ పండుగకు చీరలు పంపిణీ చేయలేదని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత దసరా పండుగ కానుకగా ప్రతి సంవత్సరం బతుకమ్మ చీరలను అందజేయడం జరుగుతందన్నారు. ఆడపడుచులకు పెద్దన్నగా సీఎం కేసీఆర్ చీరలు కానుకగా అందజేస్తున్నారని, బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమంతో మండలంలో పండుగ వాతావరణం తలపిస్తోందన్నారు. ప్రతి ఒక్కరికీ చీరలు అందే విధంగా ఏర్పాట్లు చేశామని అన్నారు. అంతకుముందు జెడ్పీ చైర్మెన్, దండే విఠల్‌ను అధికారులు, నాయకులు సన్మానించారు. అనంతరం ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన ఆసిఫాబాద్ ఇన్‌చార్జీ డీఆర్వో జాడి రాజేశ్వర్ కుటుంబాన్ని పరామర్శించారు. రాజేశ్వర్ చిత్రానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్, డీఆర్డీఓ కిషన్, ఎంపీడీఓ తిరుమల, వైస్ ఎంపీపీ దావులే బాలాజీ, కోఆప్షన్ మెంబర్ రషీద్, పీఏసీఎస్ చైర్మెన్ ఎస్పీ రెడ్డి, పార్టీ నాయకులు జాదవ్ శ్రీరాంనాయక్, కందుకూరి రమేష్, మర్సుకొల తిరుపతి, రమేష్, ప్రభాకర్, దరణి రాజేష్ ఉన్నారు.

జైనథ్ : మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో గురువారం ఎమ్మెల్యే చేతుల మీదుగా బతుకమ్మల చీరలు, మండలంలోని 62 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని అభివృద్ధి తెలంగాణలో ఉందని, ఈ అభివృద్ధిని చూసి కొన్ని పార్టీలు ఓర్వలేక పోతున్నాయని అన్నారు. గతంలో 56 సంవత్సరాలు పరిపాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం చాలీచాలని వృద్ధాప్య పెన్షన్ అమలు చేసేదని, బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలలోపే వృద్ధులకు సరిపోయే విధంగా పెన్షన్ పెంపుదల చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వందని అన్నారు. నిరుపేద కుటుంబాలకి అండగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలను అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ ప్రభుత్వమని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి, ఎంపీపీ గోవర్ధన్, మండల పార్టీ అధ్యక్షులు వెంకటరెడ్డి, సర్పంచ్ దేవన్న, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.



జైనథ్ : బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్ : ఆదిలాబాద్ మండలంలోని ఆయా గ్రామాల్లో బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. గురువారం అర్లి గ్రామంలోబతుకమ్మ చీరలు పంపిణీ చేయడం జరిగిందని సర్పంచ్ వినోద్ అన్నారు. రేషన్ షాపులో గ్రామపంచాయతీలలో బతుకమ్మ చీరలను పంపిణీ చేయడం కేసీఆర్ కానుక అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులు చేయడంలో కేసీఆర్ ఘనత అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, రేషన్ డీలర్లు, బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు.

ఆదిలాబాద్‌టౌన్ : మహిళ సంక్షేమానికి ప్రాధాన్యతను ఇస్తూ, తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని కేఆర్కే కాలనీలో ఏర్పాటు చేసిన బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీకి వచ్చిన అతిథులకు స్థానికులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం స్థానిక మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని, అందుకు అనుగుణంగానే కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆరోగ్యలక్ష్మి, న్యూట్రిషన్ కిట్లు, అమ్మ ఒడి వంటి అనేక పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని అన్నారు. కొందరు నాయకులు మాత్రం కుక్కర్లు పంపిణీ చేసి మహిళల ఓట్లు రాబట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారని, రాజకీయ లబ్ది కోసం చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, కౌన్సిలర్ అంజుబాయి పాల్గొన్నారు.

బాసర : తెలంగాణ ఆడపడుచుల ప్రతీక బతుకమ్మ పండుగ అని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఆడపడుచులకు బతుకమ్మ చీరలను, రవీంద్రాపూర్, శారదనగర్, గణేష్‌నగర్ కాలనీలకు చెందిన 29 మంది లబ్దిదారులకు ఇండ్ల పట్టాలను, ఆయా గ్రామాల యువకులకు క్రీడా పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలో పండుగలకు చీరలను పంపిణీ చేయరని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఆడపడుచులకు సీఎం కేసీఆర్ దసరా కానుకగా బతుకమ్మ చీరలను అందిస్తున్నారని అన్నారు. మహిళలు వీటిని ధరించి బతుకమ్మ ఆడి తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాలని కోరారు. ప్రభుత్వ స్థలంలో వంద



ఆదిలాబాద్‌టౌన్ :బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న మున్సిపల్‌చైర్మెన్ జోగు ప్రేమేందర్

గజాలలోపు ఇంటిని నిర్మించుకున్న వారికి ప్రభుత్వం ఇంటి పట్టాను మంజూరు చేస్తుందని లబ్ధిదారులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. యువకులు క్రీడల పట్ల అవగాహన పెంపొందించేందుకుగాను ఆయా గ్రామాలకు ప్రభుత్వం క్రీడా పరికరాలను అందిస్తుందని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ అని తెలిపారు. ప్రజలు వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని కోరారు కార్యక్రమంలో ఎంపీపీ సునీత విశ్వనాథ్ పటేల్, సర్పంచ్ లక్ష్మణరావు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నర్సింగ్ రావు, పీఏసీఎస్ చైర్మెన్ వెంకటేష్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుధాకర్‌రావు, కిర్గుల్ (బి) సర్పంచ్ దేవేందర్, ఎంపీటీసీ ప్రభాకర్, అమృత్ పటేల్, తాహసీల్దార్ పవనచంద్ర, ఎంపీడీఓ నాగనాథ్, ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

తాంసి : భీంపూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్, జడ్పీటీసీ సుధాకర్‌తో కలిసి మహిళలకు బతుకమ్మ చీరాలను పంపిణీ చేశారు. అనంతరం యువకులకు క్రీడా కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గిరిజన గ్రామాల్లో ఉన్న యువకుల కోసం రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసిందన్నారు. యువకులు పోలీస్, ఆర్మీ రిక్రూట్మెంట్‌లో ఆసక్తి కలిగిన యువతీయువకులు క్రీడా ప్రాగణాల్లో రన్నింగ్ చేయడానికి ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ రత్నా ప్రభ సంతోష్. ఎంపీడీఓ శ్రీనివాస్, పార్టీ కన్వీనర్ నాగయ్య, సర్పంచులు లింబాజి, గంగయ్య, నరేందర్ యాదవ్, నాయకులు అనిల్, సంతోష్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : రాష్ట్రంలోని సబ్బండ వర్గాల ప్రజల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అద్భుతంగా ఉన్నాయని ఎమ్మెల్సీ దండే విఠల్, జడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్ అన్నారు. గురువారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ చీరాల పంపిణీలో పాల్గొని మహిళలకు బతుకమ్మ చీరాలు, యువకులకు క్రీడా సామాగ్రిని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రం మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి, డీఆర్డీఓ కిషన్, ఎంపీపీ పోటే శోభాబాయి, పీఏసీఎస్ చైర్మన్ డోంగ్రే మారుతి పటేల్, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, వైస్ ఎంపీపీ గోపాల్ సింగ్, ఏఎంసీ మాజీ చైర్మన్ జాదవ్ శ్రీరాంనాయక్, ఎంపీడీఓ పుష్పలత, బీఆర్ఎస్ మండల కోఆర్డినేటర్ షేక్ సూఫియాన్, సర్పంచ్లు కోరెంగా గాంధారి, విజయ, రాథోడ్ సేవంత రోహిదాస్, రాంచందర్, నాగోబా ఆలయ కమిటీ చైర్మర్ మెస్రం తుకారాం, ఎంపీటీసీలు ఆశాబాయి, కోవ రాజేశ్వర్ పాల్గొన్నారు.



తాంసి, భీంపూర్ : బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు

మూడో రోజుకు రిలే నిరాహార దీక్షలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షుడు నవీన్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు కొనసాగగా గురువారంతో మూడో రోజుకు చేరుకున్నాయి. గత 15 సంవత్సరాలుగా 104 వాహనాల ద్వారా గ్రామీణ ప్రాంతాలలో గర్భిణులకు రక్త పరీక్షలు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకి బీపీ, షుగర్, పరీక్షలు అలాగే ఒక నెలకు సరిపడా మందులను ఇవ్వడం జరిగిందని అన్నారు. కానీ ఇలాంటి 104 వాహనాలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఆ వాహనాలలో పనిచేస్తున్న ఉద్యోగులను తాత్కాలికంగా సర్దుబాటు చేసి నేటికీ 22 నెలలు గడుస్తున్నా 104 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించా లేదన్నారు. 104 ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించకుండా వెట్టి చాకిరితో పని చేయిస్తున్నారని అన్నారు. వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ కార్యనిర్వహణ అధ్యక్షులు మామిడి వెంకన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్, 104 ఉద్యోగులు సురేందర్, ప్రశాంత్, విర కేశవులు, ఇబ్రహీం, పురుషోత్తం, శ్రీదేవి, జ్యోతి ఉన్నారు.

పోలీస్ ఉద్యోగానికి ఎంపికైన యువతీ, యువకులు

నవతెలంగాణ-తాంసి

ఇటీవల వెలువడిన పోలీస్ ఉద్యోగుల ఎంపిక పలితాల్లో మండల కేంద్రానికి చెందిన ఇద్దరు యువకులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. అందులో సాయి చరణ్‌రెడ్డి, బట్టు రాహుల్ ఉన్నారు. అలాగే కప్పర్ల గ్రామానికి చెందిన ఇద్దరు బండల్‌నాగపూర్ గ్రామానికి చెందిన ఒకరు ఎంపికయ్యారు. భీంపూర్ మండలంలోనీ కరంజీ(టి) గ్రామానికి చెందిన ఇద్దరు ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన రవి ఏఆర్ కానిస్టేబుల్‌కి ఎంపిక కాగా అంకిత సివిల్ కానిస్టేబుల్‌కి ఎంపికైంది. ఉద్యోగాలు సాధించిన యువతీ, యువకులను కుటుంబీకులు, బంధువులు గ్రామస్తులు అభినందించారు.

దేవి శరన్నవరాత్రి మహోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-నిర్మల్

ఈనెల 15 నుంచి 23 వరకు ప్రముఖ పుణ్యక్షేత్రం బాసరలో జరిగే శ్రీ శారదీయ శరన్నవరాత్రి (దసరా) మహోత్సవాల పోస్టర్‌లను గురువారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. మహోత్సవాలకు హాజరుకావాలని నిర్వాహకులు మంత్రికి ఆహ్వాన పత్రిక అందజేశారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి దంపతులను సత్కరించి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. దసరా మహోత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు. భక్తులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం బీఆర్ఎస్ యువ నాయకుడు గౌతంరెడ్డి పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని నగర్‌లోని సాగర్ కాలనీ రోడ్ నెంబర్-1 వద్ద రూ.10లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ఇప్పటికే నిర్మల్ నియోజకవర్గంలో ఎన్నో కమిటీ హాల్‌లు ప్రారంభించామని గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ గంద్రత్ ఈశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ ఎర్రవోతు రాజేందర్, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మెన్ ధర్మాజీ రాజేందర్, కౌన్సిలర్లు ముజాయిద్ చౌస్, అన్వర్ పాషా, సలీమ్, పుప్పాల రమేష్, లక్ష్మణచారి, జి.రమేష్ పాల్గొన్నారు.

పల్సి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-కుభీర్

పల్సి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని గురువారం ముధోల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పల్సి గ్రామస్తులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు కొట్టే హన్మాండ్లు, రాజేష్‌లు మాట్లాడుతూ గతంలోనే మండల సర్వసభ్య సమావేశంలో పల్సి గ్రామాన్ని మండల కేంద్రం ఏర్పాటు చేయాలని తీర్మానం చేయడం జరిగిందని అన్నారు. అదే విధంగా కుభీర్ మండలానికి రావాలంటే ఎక్కడ ఉన్నా కొన్ని గ్రామాలకు దూరభారంతో పాటు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇక్కడి గ్రామాల ప్రజలు సౌలభ్యం కొరకు పల్సిని మండలంగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు రాజన్న, సిరిపెల్లి సర్పంచ్ రాజేందర్, పల్సితండా సర్పంచ్ ఆయా గ్రామాల ప్రజలు నాయకులు ఉన్నారు.

సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు ప్రారంభించిన వైస్ ఎంపీపీ

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని ధర్మోరా గ్రామంలో రూ.10లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజ్ నిర్మాణ పనులను గురువారం వైస్ ఎంపీపీ మామిడి నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ మేరకు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసిన కేసీఆర్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శారద భాస్కర్, ఉప సర్పంచ్ చిన్నయ్య, వార్డు మెంబర్ ప్రకాష్, పంచాయతీ సెక్రటరీ శ్రీధర్ రెడ్డి, రమేష్‌గౌడ్, అజోబా పటేల్, ఖైరుద్దీన్ పాల్గొన్నారు.



జోగు ఫౌండేషన్ తరపున విద్యార్థుల ఫీజుల చెల్లింపు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మైనార్టీ విద్యాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా కృషి చేస్తుందని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. గురువారం పట్టణంలోని జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇంటర్ బోర్డు యాన్యువల్ ఎగ్జామ్స్ సంబంధించిన ఎగ్జామ్ ఫీజులను జోగు ఫౌండేషన్ తరపున రూ.13వేలను కాలేజీ యాజమాన్యానికి గురువారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక మైనారిటీ విద్యకు గణనీయంగా కృషి చేస్తూ గతంలో ఎన్నడూ లేని విధంగా మైనార్టీలలో ఉన్నత పదవులతో పాటు ఉన్నత స్థాయిలో రాణిస్తున్నారని అన్నారు. ఇలాంటి ప్రోత్సాకాలను ప్రతి ఒక్క విద్యార్థి అందిపుచ్చుకుంటూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సాజిదోద్దీన్, జాగృతి అధ్యక్షులు రంగినేని శ్రీనివాస్, కోఆప్షన్, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంలో దేశానికే ఆదర్శం

• జిల్లా పరిషత్ మాజీ చైర్మెన్ లోలం శ్యాంసుందర్



లోకేశ్వరం : కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న జెడ్పీ మాజీ చైర్మెన్ శ్యాంసుందర్

అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ పల్లెలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ మాజీ చైర్మెన్ లోలం శ్యాంసుందర్ అన్నారు. గురువారం మండలంలోని మన్మద్ గ్రామంలో రూ.2లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం, రూ.15 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ ప్రారంభించారు. సేవాలాల్ తండ గ్రామంలో గ్రామపంచాయతీ భవనం కొరకు రూ.20 లక్షల మంజూరు కాగా బీఆర్ఎస్ నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, నర్సరీలు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, ట్రాక్టర్లు అందించడం జరిగిందని తెలిపారు. పరిశుభ్రత పచ్చదనానికి పెద్ద పీట వేస్తూ పెద్ద ఎత్తున మొక్కల పెంపకాలను ప్రభుత్వం చేపడుతున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందిస్తూ తాగునీటి కొరతను అధిగమించడం జరిగిందని తెలిపారు. 24 గంటల పాటు నాణ్యమైన కరెంటును అందిస్తూ ప్రగతి పథంలో ముందుకు తీసుకొని వెళుతున్నామని తెలిపారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో స్పోర్ట్స్, క్రికెట్ కిట్ లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లలిత భోజన్న, ఏఎంసీ చైర్మెన్ రాజేష్ బాబు, పీఏసీఎస్ చైర్మెన్ రత్నాకర్ రావు, ఎంపీడీఓ సాల్మన్ రాజ్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ కరిపే శ్యాంసుందర్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు భుజంగ్‌రావు పటేల్, సర్పంచులు శేఖర్ రెడ్డి, భీంరావు పటేల్, ఉత్తం, నర్సింగ్‌రావు, దిగంబర్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు లింగన్న, ఎంపీటీసీలు దత్తు పటేల్, గంగాధర్, బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల కన్వీనర్ బండి ప్రశాంత్, ఏఎంసీ డైరెక్టర్ నాలం గంగయ్య, మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, శంకర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు భోజారెడ్డి, బలరాం, శ్యామ్‌రావు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

కదం తొక్కిన ఆదివాసులు

• కలెక్టరేట్ ఎదుట ఆందోళన, బైటాయింపు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కొమురంభీమ్ కాలనీలో నివాసముంటున్న ఆదివాసీలకు ఇండ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ప్రగతి భవన్ పాదయాత్రగా వెళ్లిన ఆదివాసుల పాదయాత్రను బుధవారం రాత్రి ఆర్మూర్ వరకు చేరుకోగా పోలీసులు అడ్డుకున్నారు. మూడు బస్సులో వారిని ఆదిలాబాద్ స్వాగతం బోర్డు వద్దకు తీసుకువచ్చారు. దీంతో బస్సుల నుంచి దిగకుండా అక్కడే నిరసన తెలిపారు. పోలీసులు వారి పాదయాత్రను భగ్నం చేయడాన్ని ఖండిస్తూ కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. అక్కడే వంట వార్పు నిర్వహించారు. డోలు, సన్నాయిలతో సమస్యలను తీర్చాలంటూ పెద్ద ఎత్తున నినదించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తుగా బందోబస్తు చేపట్టారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గణేష్ మాట్లాడుతూ ఎలాంటి షరతులు లేకుండా ఆదివాసులు నివాసముంటున్న స్థలాలకు పట్టాలు ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేస్తున్నారు. కాగా నిరసన కారుల దగ్గరకు జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలదేవి వచ్చి ఆదివాసీలతో మాట్లాడారు. అయినప్పటికీ వారు వినడం లేదని, ప్రగతి భవన్ తీసుకెళ్లాలని తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అక్కడే రహదారిపై భోజనాలు చేసి, అక్కడే పడుకున్నారు. కార్యక్రమంలో ఆదివాసులు పాల్గొన్నారు.



ఆదివాసీ నాయకులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్, డీఎస్పీ

ప్రభుత్వాస్పత్రి ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ - వాంకిడి

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని గురువారం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధాకర్ నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఆస్పత్రికి వచ్చే రోగులకు పూర్తిస్థాయిలో చికిత్సలు అందించాలన్నారు. ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచాలని, ఆరోగ్య కార్యక్రమాల్లో ముందుండి సేవలందించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట వైద్యాధికారి వినయ్‌కుమార్, వైద్య సిబ్బంది ఉన్నారు.



బతుకమ్మ చీరలు పంపిణీ

నవతెలంగాణ - కౌటాల

మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మ కానుకగా అందించిన చీరలను మహిళలకు అందజేశారు. మండలంలోని పార్డీ, సాండ్‌గాం, వీరవెల్లి, మొగడ్‌దగడ్, గుడ్లబోరి గ్రామ పంచాయతీల్లో స్థానిక సర్పంచ్‌లతో కలిసి బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే సీఎం కేసీఆర్ మహిళలకు బతుకమ్మ కానుకగా చీరలను పంపిణీ చేస్తున్నారన్నారు. కానుక ఎంత చిన్న వస్తువైనా చాలా విలువైనదన్నారు.



ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ - సిర్పూర్(టి)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ వి రాజగోపాల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు రుద్రారం బ్యాంకు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సదస్సులో ఆర్థిక అక్షరాస్యత ఎంపీ రూరల్ షోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ కళాజాత వారిచే బ్యాంకు పథకాలపై రైతులకు క్రాప్, మహిళలకు పొదుపు, విద్య ఇండ్ల నిర్మాణం కొరకు, వాహనాల కొనుగోలు, బంగారం లోన్, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన, ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా, అటల్ పెన్షన్ యోజన, నగదు రహిత లావాదేవీలు, సైబర్ మోసాలపై పాటలు, మాటలు, మ్యాజిక్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు చిరంజీవి, మెజీషియన్ విష్ణు, రైతు పొదుపు సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మధ్యాహ్నభోజన కార్మికుల భిక్షాటన



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మధ్యాహ్నభోజన కార్మికుల నిరవధిక సమ్మెలో భాగంగా గురువారం మండల కేంద్రంలోకార్మికులు భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరిగిన వేతనాలు, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలన్నారు. ప్రమాదబీమా, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్నభోజన కార్మికులు పాల్గొన్నారు.

దహెగాం : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వారం రోజులుగా మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం నాటికి ఎనిమిదవ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం తమ న్యాయపరమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. పెరిగిన వేతనాన్ని చెల్లించాలని, గుడ్లకు అదనంగా బడ్జెట్‌ను కేటాయించాలని, గ్యాస్ సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్నభోజన కార్మికులు మల్లిక, విజయ, లక్ష్మీ పాల్గొన్నారు.

మున్నూరుకాపు భవన నిర్మాణానికి నిధులు మంజూరు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణ మున్నూరు కాపు సంఘం భవన నిర్మాణానికి రూ. 25 లక్షల మంజూరు పత్రాన్ని గురువారం జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణ సంఘం నాయకులకు అందించారు. కాపువాడలోని మున్నూరు కాపు సంఘం కమ్యూనిటీ హాల్ అదనపు గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఈ నిధులు మంజూరు చేయించారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



నవతెలంగాణ-బెజ్జూర్

రైతులు వేసిన పత్తి పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం మండలంలోని నాగుల్వాయి, ఏటిగూడెం, రంగాపూర్ గ్రామాల్లో ఆయన పంటలను పరిశీలించారు. పంటలు విక్రయించే సమయంలో ఆన్‌లైన్‌లో నమోదు ఉన్న వాటినే తీసుకుంటారన్నారు. రైతులు వేసిన పంటలను ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. పంటల నమోదును పకడ్బందీగా చేపట్టాలని వ్యవసాయ విస్తరణ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట బెజ్జూర్ ఏఈఓ మీనా ఉన్నారు.

త్రిశంకు స్వర్గంలో ఎస్పీఎం కాంట్రాక్టు కార్మికులు

- ప్రభుత్వానికి, యాజమాన్యానికి మధ్య నలుగుతున్న వైనం
- యాజమాన్యంపై ఒత్తిడి తేవడంలో ప్రజాప్రతినిధుల వైఫల్యం

సిర్పూరు పేపర్ మిల్లు కాంట్రాక్టు కార్మికులు త్రిశంకు స్వర్గంలో తేలియాడుతున్నారు. వారికి చెల్లించే పరిహారం విషయంలో ఐదేండ్లుగా వివాదం కొనసాగుతూనే ఉంది. స్థానిక ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రతి ఎన్నికల సమయంలో వీరికి చెల్లించే పరిహారం విషయంలో హామీలిస్తూ వస్తున్నారు. కాని చెల్లింపు దగ్గరకు వచ్చేసరికి చేతులు ఎత్తేస్తున్నారు. మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు వస్తుండడంతో ఈ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది.

నవతెలంగాణ-కాగజ్‌నగర్


సిర్పూరు పేపర్ మిల్లు మూతపడ్డ కాలానికి కాంట్రాక్టు కార్మికులకు చెల్లించే పరిహారాన్ని ఎన్నికలు పూర్తి కాగానే చెల్లిస్తామని 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప వాగ్దానమిచ్చారు. కాని ఎన్నికలు పూర్తి కాగానే ఈ అంశాన్ని పూర్తిగా విస్మరించారు. ఏడాది తర్వాత వచ్చిన మున్సిపల్ ఎన్నికల సమయంలో మళ్లీ ఈ అంశాన్ని తెరపైకి తీసుకువచ్చి కార్మికులను కేటీఆర్ వద్దకు తీసుకువెళ్లి హామీ ఇప్పించారు. మళ్లీ దీని ఊసే లేదు. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలు వస్తుండడంతో ఈ ఏడాది ఆగష్టు నెలలో మళ్లీ కాంట్రాక్టు కార్మికులను తీసుకువెళ్లి కేటీఆర్‌ను కలిపించి హామీ ఇచ్చారు. కాని ఇప్పటి వరకు యాజమాన్యం కార్మికులకు పరిహారం చెల్లించే విషయంలో ఎలాంటి ప్రకటన చేయలేదు. పైగా ఎమ్మెల్యే కోనప్ప బుధవారం మిల్లు గేటు ముందుకు వెళ్లి యాజమాన్యం స్పందించని పక్షంలో తానే మిల్లు గేటు ముందు దీక్ష చేపడుతానని కార్మికుల సమక్షంలో ప్రకటించారు.

అసలు వివాదమేమిటి ?

ఐదేళ్లుగా నానుతున్న ఈ వివాదానికి మిల్లు యాజమాన్య వైఖరే కారణమని తెలుస్తోంది. 2014లో ఈ మిల్లు మూతపడింది. ప్రభుత్వ రాయితీలతో తిరిగి ఈ మిల్లు 2018, ఆగష్టులో పున:ప్రారంభమైంది. చట్టవిరుద్ధంగా మిల్లును మూసివేసినందుకు మిల్లులో పని చేసే కాంట్రాక్టు, పర్మినెంట్ కార్మికులకు పరిహారం చెల్లించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా పర్మినెంట్ కార్మికులకు ఒక్కొక్కరికి రూ. 63 వేల చొప్పున అప్పట్లోనే చెల్లించారు. ఇక కాంట్రాక్టు కార్మికుల విషయానికి వచ్చేసరికి యాజమాన్యం మొండికేసింది. కాంట్రాక్టు కార్మికులకు పరిహారం చెల్లింపు కోసం ప్రభుత్వం ఈ ఏడాది ఆగష్టు నెలలో రూ. 10.70 కోట్లు మంజూరు చేసి యాజమాన్యానికి పంపించింది. దీనితో యాజమాన్యం మిల్లు మూసివేత సమయంలో ఉన్న కాంట్రాక్టు కార్మికుల లెక్కలు తీసింది. మొత్తం 1,682 మంది కాంట్రాక్టు కార్మికులు ఉన్నట్లు తేలింది. ఇందులో నెలకు పది హాజర్లు, అంతకంటే ఎక్కువ ఉన్న వారికి రూ. 40 వేలు, పది హాజర్ల లోపు ఉన్న వారికి రూ. 20 వేలు ఇవ్వాలని నిర్ణయించి లెక్క చేయడంతో ఈ మొత్తం రూ. 5.70 కోట్ల వరకు చేరింది. కాని యాజమాన్యం కేవలం రూ. 3 కోట్లు మాత్రమే చెల్లిస్తామని మొండికేసింది. ప్రభుత్వం నుండి తమకు సబ్సిడీ రూపేణా సుమారు రూ. 20 కోట్ల వరకు రావాల్సి ఉందని, తాము కార్మికులకు రూ. 3 కోట్లు చెల్లించి మిగిలిన రూ. 7.70 కోట్లను తమకు రావాల్సిన బకాయిలలో చూసుకుంటామని తేల్చిచెప్పింది. దీనితో కాంట్రాక్టు కార్మికులు అటు ప్రభుత్వానికి, ఇటు యాజమాన్యానికి మధ్య నలిగిపోయే పరిస్థితి తలెత్తింది. ఈ పరిస్థితులలో తాను మళ్లీ హైదరాబాద్‌కు వెళ్లి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లను కలిసి మరికొన్ని నిధుల మంజూరుకు కృషి చేస్తానని, సాధ్యంకాని పక్షంలో యాజమాన్య వైఖరికి నిరసనగా తానే స్వయంగా మిల్లు గేటు ముందు దీక్ష చేస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు.

యాజమాన్యంపై ఎందుకు ఒత్తిడి తేవడం లేదు?

మిల్లు పున:ప్రారంభమైన నాటి నుండి నేటి వరకు యాజమాన్యం ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతోంది. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకే ఈ పరిశ్రమను పున:ప్రారంభిస్తున్నట్లు ప్రారంభోత్సవ సమయంలో కేటీఆర్ చెప్పారు. కాని ఈ మిల్లులో స్థానిక యువతకు అవకాశాలు ఇవ్వకపోగా బయటి రాష్ట్రాల వారికే ప్రాధాన్యత ఇచ్చారు. ఈ విషయాన్ని ఏనాడూ ప్రభుత్వం పట్టించుకోలేదు. అంతేకాకుండా తన ఆస్థులంటూ కొన్నేళ్లుగా ప్రజలు రాకపోకలు సాగించే రహదారులను సైతం మూసివేసింది. ప్రజల సంక్షేమం కోసం పాత యాజమాన్యం ఏర్పాటు చేసిన క్రీడా మైదానంలోకి వెళ్లేందుకు ఇప్పటి యాజమాన్యం ఆంక్షలు విధించింది. రోడ్లపైనే విచ్చలవిడిగా లారీలను పార్క్ చేసి ప్రమాదాలకు కారణమవుతున్నా ఏనాడూ స్థానిక ఎమ్మెల్యే కాని, అధికారులు కాని పట్టించుకోలేదు. ఇపుడు కార్మికులకు చెల్లించే పరిహారం విషయంలో కూడా యాజమాన్యం మెడలు వంచడంలో ప్రజాప్రతినిధులు విఫలమవుతున్నారు. 'స్థానిక ప్రజల అవసరాల దృష్ట్యా ప్రభుత్వం బలవంతంగా మిల్లును మాకు అప్పగించింది కాబట్టి మాకు తోచిన విధంగా చేసుకుంటాం, మీరెవరు అడగడానికి' అనే చందంగా యాజమాన్యం తీరు ఉండడంతో అటు ప్రజలు, ఇటు కార్మికులు అవస్థలు పడుతున్నారు.



ఆగస్టు నెలలో కేటీఆర్‌ను కలిసిన ఎస్పీఎం కాంట్రాక్టు కార్మికులు (ఫైల్)

మూతపడ్డకాలానికి పూర్తి వేతనాలు చెల్లించాలి : ఎండి అష్రఫ్, జాగృతి యువమంచ్ వ్యవస్థాపకులు

సిర్పూరు పేపర్ మిల్లును చట్టవ్యతిరేకంగా మూసివేశారు. కాబట్టి మూతపడ్డ కాలానికి పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులకు పూర్తి వేతనాలు చెల్లించాలి. కొత్త యాజమాన్యం తమ దయాదాక్షిణ్యాల మీద ఇస్తున్నట్లు వ్యవహరిస్తోంది. ఇది సరికాదు. ప్రజాప్రతినిధులు కూడా యాజమాన్యంపై ఒత్తిడి తీసుకువచ్చి పూర్తి వేతనం చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

ఉద్రిక్తతకు దారి తీసిన ఎండీఎం కార్మికుల నిరసన

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మధ్యాహ్న భోజన కార్మికులు గురువారం చేపట్టిన నిరసన ఉద్రిక్తతకు దారి తీసింది. కొన్ని రోజులుగా తాము సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో స్థానిక ఎన్టీఆర్ చౌక్‌లో ఖాళీ ప్లేట్లలో మట్టి వేసుకొని తినే విధంగా నిరసన చేపట్టారు. దీంతో నాలుగు వైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు రంగప్రవేశం చేసి వారిని అరెస్ట్ చేసే ప్రయత్నం చేయగా మహిళలు అడ్డుకున్నారు. దీనితో మహిళలకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. సిఐటీయూ నాయకుడు ముంజం ఆనంద్‌కుమార్‌ను అరెస్ట్ చేసి తీసుకువెళుతుండగా కార్మికులు అడ్డుకున్నారు. మహిళా పోలీసులు కార్మికులను బలవంతంగా పక్కకు లాగారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మికులు మాట్లాడుతూ తాము గత 20 ఏళ్లుగా వెట్టిచాకిరి చేస్తున్నామని, అయినా ప్రభుత్వం మమ్మల్ని పట్టించుకోవడం లేదని అన్నారు. నెలకు రూ. 1000 చెల్లిస్తున్నారని, ఇది కూడా గత ఆరు నెలలుగా చెల్లించకపోవడంతో తాము ఎలా బతకాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు శ్యామలి, కమల, సురేఖ, చంప, వీరమణి, మౌనిక, లక్ష్మి పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌లో చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ఎండీఎం కార్మికులు

విద్యుత్ ఏఈకి కేవీపీఎస్ వినతి



నవతెలంగాణ - వాంకిడి

మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ ఇంజనీర్ సోమియాకు కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దుర్గం దినకర్ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ 342 ప్రకారం దళిత కుటుంబాలకు 101 యూనిట్లు విద్యుత్ ఉచితంగా అందించాలన్నారు. పెట్టుబడిదారులకు, గెజిటెడ్ ఉద్యోగులకు, ధనవంతులకు, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందిస్తుందని, ఇల్లు, భూమి లేని నిరుపేదలైన దళిత కుటుంబాలకు 101 యూనిట్లు ఉచిత విద్యుత్ ఎందుకు అందించడం లేదని ప్రశ్నించారు. వెంటనే దళిత కుటుంబాలందరికి ఉచిత విద్యుత్ అమలు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కులం సర్టిఫికేట్ అందించడం లేదనే సాకుతో విద్యుత్ సబ్సిడీ ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం ఆన్‌లైన్ డేటా ప్రకారంగా దళితుల కుటుంబాలలో లిస్టులో ఉన్న వారికి ఉచిత విద్యుత్ అందించాలని, 101 యూనిట్లు దాటిన కుటుంబాలకు వర్తించకుండా జీవో ఉందని, 300 యూనిట్ల వరకు ఉచితంగా ఇవ్వాలని, లేనిపక్షంలో పక్షంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు వడ్లూరి వెంకటేశ్, లింగయ్య, మల్లయ్య, వెంకటి, తిరుపతి, పుష్ప పాల్గొన్నారు.

కష్టపడ్డారు..కొలువు కొట్టారు..

- పోలీస్ శాఖ కొలువులో మండల యువకుల సత్తా

నవతెలంగాణ - దహెగాం

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం రాత్రి వెలువడిన పోలీస్ శాఖ ఉద్యోగ ఫలితాల్లో మండలానికి చెందిన యువత సత్తా చాటారు. మండల చరిత్రలోనే కనీవిని ఎరుగని రీతిలో వివిధ గ్రామాలకు చెందిన 18 మంది యువతీ యువకులు పోలీస్ ఉద్యోగానికి ఎంపికై చరిత్ర సృష్టించారు. దీంతో వివిధ గ్రామాల్లో కొలువులు సాధించిన కుటుంబాల్లో ఆనందం తొణికిసలాడుతోంది. ఒడ్డుగూడ గ్రామానికి చెందిన అన్నాచెల్లెలు పోలీసు ఉద్యోగానికి ఎంపికయ్యారు. దాసరి శ్రీకాంత్(టీఎస్ఎస్పీ), అతని చెల్లెలు దాసరి సమ్మక్క జాతీయ స్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారిణిగా స్పోర్ట్స్ కోటాలో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికైంది. రాంపూర్ గ్రామానికి చెందిన కాటెల భీమేష్ ఏఆర్ కానిస్టేబుల్‌గా, ఖర్జీ గ్రామానికి చెందిన చౌదరి శ్రీనివాస్ సివిల్ కానిస్టేబుల్‌గా, అదే గ్రామానికి చెందిన తుమ్మె దామోదర్ టీఎస్ఎస్పీ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. అలాగే గితరవెల్లి గ్రామానికి చెందిన రౌతు సాగర్ సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. బ్రాహ్మణ్‌చిచ్చాల గ్రామానికి చెందిన దందెర రాజశేఖర్ ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపిక కాగా లగ్గాం గ్రామానికి చెందిన కొట్ల శ్రీలత ఏఆర్ కానిస్టేబుల్‌గా, కల్వాడ గ్రామానికి చెందిన కోండ్ర సాయి, ప్రియాంక సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. హత్తిని గ్రామానికి చెందిన కోండ్ర శివ ఏఆర్ కానిస్టేబుల్‌గా, కొంచవెల్లి గ్రామానికి చెందిన మంచుకట్ల మానస ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. ఇట్యాల గ్రామానికి చెందిన పిప్పిరి రమణి సివిల్ కానిస్టేబుల్‌గా, గొర్రె తిరుపతి టీఎస్ఎస్పీ, ముత్తునేని శివకుమార్ ఫైర్ డిపార్టుమెంటులో కానిస్టేబుల్‌గా ఎంపిక కాగా అదే గ్రామానికి చెందిన బుద్ద సాగర్ ఈఎస్ఎఫ్ బెటాలియన్‌లో జవాన్‌గా పనిచేస్తూ ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. పెసరుగుంట గ్రామానికి చెందిన నాయికిని సాయిలత సైతం సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు.

సమ్మె కాలపు ఒప్పందాన్ని అమలు చేయాలి

నవతెలంగాణ-దహెగాం

తెలంగాణ రాష్ట్రంలోని నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరిని ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బి మధుకర్ డిమాండ్ చేశారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జి డాక్టర్ మల్లికార్జున్‌కు ఏఐటియుసి ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మధుకర్ మాట్లాడుతూ 15 సంవత్సరాల నుంచి సుమారు 20వేల మంది సిబ్బంది చాలీచాలని వేతనాలు తీసుకుంటూ శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో, ప్రమాదవశాత్తు మరణించిన వారి స్థానంలో కారుణ్య నియామకాల ద్వారా ఆరు నెలల్లో కుటుంబంలో ఒకరికి పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు హెల్త్ కార్డ్స్ ఇవ్వాలని, బీమా సౌకర్యం రూ.25లక్షలు ఇవ్వాలని, రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. ఈ నెల 6న కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా అనంతరం 9న హైదరాబాదులోని డైరెక్టర్ హెల్త్ కార్యాలయం ముందు మహాధర్నా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్కీం సిబ్బంది మాధవి, లక్ష్మీ పాల్గొన్నారు

మూడోసారి ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించాలి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

నవతెలంగాణ - కాసిపేట

ఎమ్మెల్యేగా మూడో సారి గెలిపించి ఆదరించాలని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కోరారు. గురువారం సోమగూడెం భరత్ కాలనీ గ్రామ పంచాయతీ సమీపంలో రూ.18 లక్షలతో మహిళా సంఘాల ఐకేపీ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం క్రీడాకారులకు క్రీడా కిట్లను పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ కొరికొప్పుల ప్రమీలాగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే చిన్నయ్య మాట్లాడారు. సోమగూడెంలో సింగరేణి స్థలాల్లో పట్టాలను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చానని, స్థానికంగా అందుబాటులో ఉండే తనను మరో సారి గెలిపించాలని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణాలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. అనంతరం పలువురు ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ పొట్లపల్లి సుభాష్‌రావు, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి కొమ్మెల లక్ష్మణ్, మండల అధ్యక్షుడు గణేశ్‌గౌడ్, ఎంపీడీవో రాజేందర్, ఎంపీవో శ్రీనివాస్, గ్రామ అధ్యక్షురాలు ఊరగొండ జ్యోతి, వార్డు సభ్యులు జాడి ప్రమీలా, శంకర్‌గౌడ్, కొరకొప్పుల రమ, చీమల శైలజ, ఎండీ సల్మా, బీఆర్ఎస్ యూత్ ఉపాధ్యాక్షుడు రంగు రవితేజ, దుర్గం గోపాల్, మాడ గోపాల్, కుక్క రాంచందర్, వొడ్నాల సత్యనారాయణ, జిల్లాల రాజేందర్, కార్యదర్శి రాయలింగు, యూత్ నాయకులు విజయ్, ఐకేపీ సీసీ రామకృష్ణ, సీఏ మహేష్ పాల్గొన్నారు.



కానిస్టేబుల్ ఫలితాల్లో మండల వాసుల ప్రతిభ

పెంచికల్‌పేట్ : ప్రభుత్వం విడుదల చేసిన కానిస్టేబుల్ ఫలితాల్లో మండలంలోని యువతీయువకులు ప్రతిభ కనబరిచారు. మండలంలోని ఎల్లూరు గ్రామానికి కుకుడ మధూకర్, కుకుడ దిలీప్, పెంచికల్‌పేట్ గ్రామానికి చెందిన గాదం రాజేష్, చిన్నం సాయికృష్ణ, లోడ్‌పెల్లి గ్రామానికి చెందిన అనాస సౌందర్య, దరోగపెల్లి గ్రామానికి చెందిన శివ, జ్యోతి, కిరణ్, చెడ్వాయి గ్రామానికి చెందిన లక్ష్మణ్, రాము, వెంకటేష్, చక్రవర్తి, బండన్న, ఇమ్రాన్, గుంట్లపేట గ్రామానికి చెందిన శ్రావణ్, సురేష్, అగర్‌గూడ గ్రామానికి చెందిన సుధాకర్, చంద్రశేఖర్ పోలీస్ శాఖలో ఏఆర్, సివిల్ ఫైర్, టీఎస్ఎస్పీ విభాగాల్లో ఎంపికయ్యారు. మండలం నుండి ఇంత మంది ఎంపికవడం పట్ల మండలవాసులు ఆనందం వ్యక్తం చేశారు.

పేదరికంలో మెరిసిన కుసుమాలు

నవతెలంగాణ-బెజ్జూర్

ప్రభుత్వం ప్రకటించిన కానిస్టేబుల్ ఫలితాల్లో పేదరికం నుండి ఉద్యోగాన్ని సాధించి తమ సత్తాచాటారు. బెజ్జూర్ మండలం నుండి ఏడుగురు అభ్యర్థులు కానిస్టేబుల్ కొలువులు సాధించారు. ఇందులో ముగ్గురు అభ్యర్థులు పేదరికం నుంచి వచ్చిన వారే ఉన్నారు. అందులో రెండు కుటుంబాల్లో అక్కాచెల్లెళ్లు, చెల్లెతమ్ముడు ఉద్యోగం సాధించారు. దీంతో మండల ప్రజలు వారిని అభినందిస్తున్నారు. ఇప్పలగూడ గ్రామానికి చెందిన తిరుమలేశ్ టీఎస్ఎస్పీ కానిస్టేబుల్‌గా ఉద్యోగాన్ని సాధించాడు. తిరుమలేశ్ తండ్రి తిరుపతి కూలీ పనిచేసి పిల్లలను చదివించారు. పని చేస్తూ చదువుకున్నారు. మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించడం తనకెంతో ఆనందాన్నిస్తుందని, తల్లిదండ్రుల ఆశీస్సులతో తనకు ఉద్యోగం లభించిందని తిరుమలేశ్ ఆనందం వ్యక్తం చేశారు. లంబాడిగూడకు చెందిన దుర్గం యమునకు ఏఆర్‌లో, దుర్గం ఉమాపతి టీఎస్ఎస్పీలో ఉద్యోగం సాధించారు. వీరద్దరు ఒకే కుటుంబం కాగా దుర్గం హన్మంతు పిల్లలు కార్పెంటర్ పనిచేస్తూ పిల్లలను చదివించిన హన్మంతుకు ఒకే కుటుంబంలో ఇద్దరికి ఉద్యోగం లభించడం ఎంతో ఆనందిస్తుందన్నారు. అంతే కాకుండా బెజ్జూర్ జడ్పీటీసీ పుష్పలత కుమారుడు, కుమార్తెకు కూడా సివిల్ విభాగంలో ఉద్యోగం సాధించారు. బెజ్జూర్‌కు చెందిన పొన్న సాయిచరణ్ అగ్నిమాపక విభాగంలో మొదటి ప్రయత్నంలో విజయం సాధించాడు. పొన్న సాయి తండ్రి రాములు మందుల షాపులో పనిచేస్తూ కుమారుడిని చదివించారు. పేదరికంలో ఉన్న రాములకు కొడుకు ఉద్యోగం రావడంతో అతని ఆనందానికి అవదులు లేకుండా పోయాయి. బెజ్జూర్ మండలంలో మొదటిసారి కానిస్టేబుల్‌లో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను మండలవాసులు అభినందిస్తున్నారు. మారుమూల గ్రామాల నుండి వీరంతా ఎంపికయ్యారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
శుక్రవారం | అక్టోబర్ 06, 2023 | www.navatelangana.com

ఆర్‌కే ఓసీపీలో స్వచ్ఛతా హి సేవా

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



ఆర్‌కే ఓసీపీ మేనేజర్ సీహెచ్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛతా హి సేవా 3.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. గని కార్యాలయ ప్రాంతంలో చెత్తను తొలగించారు. అనంతరం మేనేజర్ మాట్లాడుతూ కార్మికులు గని ఆవరణ, పని ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే తమ ఇంటి పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ ఆఫీసర్ కే.రామరాజు, అధికారులు, యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని పొన్కల్ పీఏసీఎస్ కార్యాలయ ఆవరణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు దసరా కానుకగా అందించే బతుకమ్మ చీరలను ఎంపీపీ మాదాడి సరోజన, జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు చీరలను అందిస్తుందని తెలిపారు. బతుకమ్మ పండుగను ఆందోత్సవాల నడుమ జరుపుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి మహిళలు బాసటగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి జక్కు భూమేష్, పీఏసీఎస్ చైర్మెన్ రమేష్ పాల్గొన్నారు.

పురుగులమందు తాగి మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-భీమారం



పురుగులమందు తాగి మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దామరకొండ శంకరమ్మ(52) బుధవారం సాయంత్రం పురుగులమందు తాగింది. గమనించిన కుటుంబీకులు మంచిర్యాల ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి భర్త ఏడాది క్రితం పక్షవాతంతో మరణించారు. అప్పటి నుంచి శంకరమ్మ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మనస్థాపానికి గురై పురుగులమందు తాగింది.

16న సింగరేణి ఉద్యోగులకు లాభాల వాటా

నవతెలంగాణ-రెబ్బెన

ఈనెల 16న సింగరేణి ఉద్యోగులకు లాభాల వాటా చెల్లించనున్నట్లు టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ మర్లాజ్ శ్రీనివాస్ ఒక పేర్కొన్నారు. 022-23 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన రూ.2222 కోట్ల లాభాల్లో 32 శాతం రూ.711.18 కోట్లను సింగరేణి కార్మికులకు చెల్లించే విధంగా సీఎం కేసీఆర్ గతంలో ప్రకటించారు. దీనికి అనుగుణంగా సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్ట్స్) గురువారం సర్క్యూలర్ విడుదల చేసిందన్నారు. అండర్‌గ్రౌండ్ కార్మికులకు, ఓపెన్‌కాస్టు కార్మికులకు, సర్ఫేస్ ఉద్యోగులకు వేరువేరుగా రోజూవారీ మాస్టర్ ప్రాతిపదికన లాభాల వాటా చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ప్రోత్సాహక బహుమతి పొందిన వారికి ఒక పర్సెంట్ రూ.7.11 కోట్లు, గ్రూప్ ఇన్సెంటివ్ ప్రకారం చెల్లించబడుతాయన్నారు. అండర్ గ్రౌండ్ కార్మికులకు రోజుకు రూ.662.74, ఓపెన్‌కాస్టు కార్మికులకు రూ.524.66, సర్ఫేస్ కార్మికులకు రూ.484.31గా చెల్లించబడుతాయని తెలిపారు. లాభాల వాటా పెంచి ఇచ్చిన కేసీఆర్‌కు, కృషి చేసిన సింగరేణి ప్రాంత ప్రజా ప్రతినిధులకు, టీబీజీకేఎస్ నాయకత్వానికి సింగరేణి ఉద్యోగుల తరపున ధన్యవాదాలు తెలియజేశారు.

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బేల మండలంలోని మాంగ్రూడ్ గ్రామం ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులకు 1/70 చట్టానికి విరుద్ధంగా పట్టాను గతంలో ఉన్న బేల మండల తహసీల్దార్ రాంరెడ్డి ఇచ్చారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం అదనపు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బేల మండలంలోని మాంగ్రూడ్ ఏజెన్సీ ప్రాంతంలోకి వస్తుందని, అక్కడ 1/70 చట్టానికి విరుద్ధంగా గతంలో ఉన్న తహసీల్దార్ సర్వే నంబర్ 27/2లోని భూమిని బోయర్ రేవన్ పేరుతో ఉన్న పట్టాను దిడ్డే మనోహర్ పేరుపై జారీ చేశారని ఆరోపించారు. ఏజెన్సీ ఏరియాలో పట్ట జారీ చేయడం 1/70 చట్టం, 1/59, పిసా చట్టం ప్రకారం నేరామన్నారు. తహసీల్దార్‌పై వెంటనే చర్యలు తీసుకోవడంతో పాటు పట్టాను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సానుకూలంగా స్పందించిన అదనపు కలెక్టర్ విచారణ జరిపి చ్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భీమనవేణి వెంకట్, బీసీసెల్ ఆదిలాబాద్ మండల అధ్యక్షుడు వెంకట్, విద్యార్థి సంఘం అధ్యక్షుడు రాహుల్ ఉన్నారు.

బోట్‌ను ప్రారంభించిన మంత్రి అల్లోల



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని చించోలి అర్బన్ పార్కులో ఏర్పాటు చేసిన వాటర్ బోట్‌లను గురువారం రాష్ట్ర అటవీ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ప్రారంభించారు. రూ 3లక్షల నిధులతో రెండు బోట్‌లు ఇక్కడ ఏర్పాటు చేశారు. పచ్చని అహ్లాదకర ప్రాంతంలో బోటింగ్ చేయడం ఆనందంగా ఉంటుందని, చుట్టూ పక్కల ప్రారంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఎఫ్ శరవణన్, డీఎఫ్ఓ రామకృష్ణ, ఎఫ్ఆర్ఓ జైపాల్ రెడ్డి, ఎఫ్ఎస్ఓ శ్రీదేవి పాల్గొన్నారు.

లాంగ్ టర్మ్ కోచింగ్‌కు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని పీవీటీజీ గిరిజన విద్యార్థులు ఉచిత నీట్ కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకొని శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని గిరిజన గురుకులాల సమన్వయ అధికారి గంగాధర్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ గిరిజన గురుకులాల సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని హాయత్ నగర్ పీవీటీజీ ప్రతిభా కళాశాలలో 50 మందికి ఉచితంగా నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ ఇవ్వనున్నట్లు, బైపీసీ ఉత్తీర్ణులై అర్హత కలిగిన పీవీటీజీ తెగకు చెందిన విద్యార్థులు తమ నిజ ధృవపత్రాలతో ఉట్నూర్ ఆర్సీఓ కార్యాలయంలో లేదా ఆసిఫాబాద్ పీవీటీజీ గురుకులంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఆసిఫాబాద్ ప్రిన్సిపాల్ సురేష్ 9490957303 నెంబర్ సంప్రదించాలని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

- 11 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం
- కలెక్టరేట్ ముట్టడి, అదనపు కలెక్టర్ వాహనం అడ్డగింత



నవతెలంగాణ-మంచిర్యాల

ఆశాల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆశ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సమ్మక్క, శోభ అన్నారు. ఆశా యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో 11వ రోజు నిరసన కార్యక్రమంలో భాగంగా గురువారం కలెక్టరేట్ ముట్టడి చేపట్టారు. కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చి గేటు ఎదుట ఆందోళన చేపట్టారు. అటుగా వచ్చిన అదనపు కలెక్టర్ రాహుల్ వాహనాన్ని అడ్డుకొని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారితోషకం పేరుతో ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయించుకుంటుందని ఆరోపించారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనం లేదని, ప్రజలకు సేవలు అందించే ఆశాలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం చాలా దారుణమన్నారు. టార్గెట్స్ పేరుతో అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని, ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే ఆశాలకు విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని, క్వాలిటీ యూనిఫామ్‌లు, హెల్త్ కార్డులు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య మాట్లాడుతూ 11 రోజులుగా మండల కేంద్రాల్లో సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు గడుస్తున్న ఉద్యోగ, కార్మిక సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా కమిటీ సభ్యురాళ్లు పుష్ప, భాగ్య, లీలావతి, విజయలక్ష్మి, స్రవంతి, రాణి, కవిత , సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జి. ప్రకాష్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కనికరపు అశోక్, మత్స్యకారుల సంఘం జిల్లా కార్యదర్శి బోడేంకి చందు, రజక సంఘము జిల్లా కార్యదర్శి పైరాల రాములు, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు గుమస అశోక్ పాల్గొన్నారు.

జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాలి

- రాష్ట్ర వ్యాప్త సమ్మెలపై ప్రభుత్వం స్పందించాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి వైద్య శిబిరాలను నిర్వహించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ళ ఆశయ్య డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సమావేశం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కనికరపు అశోక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పైళ్ల ఆశయ్య మాట్లాడుతూ జిల్లాలో కొన్ని రోజుల నుండి ప్రజలందరూ అనారోగ్యం బారిన పడుతన్నారన్నారు. విష జ్వరాలతో ఇప్పటికే జిల్లాలో 8 మంది చనిపోయిన వైద్య ఆరోగ్య శాఖ స్పందించడం లేదన్నారు. జిల్లా, మండల ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యానికి వచ్చే ప్రజలకు సౌకర్యాలు లేకపోవడం, వైద్యులు సమయానికి అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ప్రయివేట్‌కు వేళ్తున్నారన్నారు. జిల్లా వైద్య శాఖ అధికారులు పేదలకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహారిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆశాలు, మధ్యాహ్న భోజన కార్మికులు, స్కూల్ స్వీపర్ల సమస్యలపై చేస్తున్న సమ్మెపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. చెన్నూరులో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు 58, 59 జీఓ వర్తింపచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి , ప్రకాష్, అశోక్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అశోక్, చందు, దుంపల రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- సమ్మెకు మద్దతు తెలిపిన ప్రజా సంఘాలు



నవతెలంగాణ-మంచిర్యాల

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె గురువారం 3వ రోజుకి చేరింది. సమ్మెకు ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ రాష్టంలో 104 ఉద్యోగులు 20 సంవత్సరాల నుండి కాంట్రాక్టు పద్దతిలో డ్రైవర్లు, డేటా ఆపరేటర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, సెక్యూరిటీ గార్డులు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఏఎన్ఎంలు పని చేస్తున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి హామీ ప్రకారం కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి పర్మినెంట్ చేయాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని, ఏజెన్సీలను రద్దు చేసి నేరుగా ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలన్నారు. లేని పక్షంలో భవిష్యత్తులో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జి. ప్రకాష్, 104 ఉద్యోగులు శ్రీనివాస్, రమేష్, నారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కనికరపు అశోక్, మత్స్యకారుల సంఘం జిల్లా కార్యదర్శి బోడేంకి చందు, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు గోమాస అశోక్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకూ లాభాల్లో వాటా ఇవ్వాలి



నవతెలంగాణ-మంచిర్యాల

సింగరేణిలో రెగ్యులర్ కార్మికులకు చెల్లించే 32 శాతం లాభాల వాటాను కాంట్రాక్ట్ కార్మికులకు కూడా చెల్లించాలని టీఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొంచెం భూపతి, ప్రధాన కార్యదర్శి మనిరామ్ సింగ్ అన్నారు. గురువారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 7 గనిలో జరిగిన గేట్ మీటింగ్లో వారు పాల్గొని మాట్లాడారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి, ఉత్పాదకత పెరిగి, సింగరేణి చరిత్రలోనే అత్యధికంగా రూ. 33,065 కోట్ల టర్నోవర్ జరిగి, రూ.2.222 కోట్ల నికర లాభాలు సాధించి రికార్డు సష్టించిందన్నారు. అలాగే ఇతర టాక్స్‌ల రూపంలో చెల్లింపుల అనంతరం లాభాలను ఆర్జించిందని యాజమాన్యం బహిరంగ ప్రకటన చేసిందన్నారు. సింగరేణి వ్యాప్తంగా 30 వేలపై చిలుకు కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారని, భూగర్భ గనులలో ఓపెన్ కాస్టులలో పర్మినెంట్ కార్మికులతో సమానంగా పని స్థలాల్లో, ఉత్పత్తిలో భాగస్వాములు అవుతున్నారన్నారు. సంస్థ రికార్డు స్థాయిలో లాభాలు రావడంలో కాంట్రాక్టు కార్మికుల శ్రమ కూడా ఉందన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తూ వారిని కూడా లాభాలలో భాగస్వాములను చేయాలన్నారు. స్వీట్ డబ్బాలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ కార్మికులతో సమానంగా కాంట్రాక్టు కార్మికులకు కూడా లాభాలలో 35శాతం వాటా చెల్లించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా కనీస వేతనాల జీఓ 2022 ముగిసిన కొత్త జీఓ ఇవ్వలేదాన్నారు. వెంటనే జీఓ 2022ను గెజిట్ చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి రూ. 26,000/- వేతనాలు చెల్లించాలని పేర్కొన్నారు. లేని పక్షంలో కార్మిక సంఘాలను మమేకం చేసి జీఎం కార్యాలయాలం ఎదుట ఆందోళనలు చేపడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ వైస్ ప్రెసిడెంట్ నారాయణ, ఆర్కే 7 ఫీట్ కార్యదర్శి లక్ష్మణ్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు హాసన్, తలారీ రాజు, సదానందం, ఆవుల సుధాకర్ పాల్గొన్నారు.

ఖోఖో పోటీల్లో రేచిని విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-తాండూర్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి అండర్ 14 బాలబాలికల ఖోఖో టోర్నమెంట్ మరియు సెలక్షన్స్‌లో రేచిని జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పరిమళ తెలిపారు. పోటీలకు జిల్లాలోని ఆయా మండలాల నుండి 16 బాలుర, 8 బాలికల జట్లు పాల్గొన్నాయన్నారు. బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో జడ్పీహెచ్ఎస్(రేచిని), ద్వితీయ స్థానంలో టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్‌జేసీ(జైపూర్) పొందాయన్నారు. బాలికల విభాగంలో రేచిని జడ్పీహెచ్ఎస్ ప్రథమ స్థానం పొందగా నీల్వాయి జడ్పీహెచ్ఎస్ రెండవ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. గెలుపొందిన జట్లకు గురువారం బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో రేచిని జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు ప్రదీప్, గ్రామ సర్పంచ్ దుర్గ బాయి, ఎంపీటీసీ శంకర్, సింగిల్ విండో చైర్మెన్ దత్తుమూర్తి, ఎస్ఎంసీ చైర్మెన్ ఎల్లన్న, తంగళ్ళపల్లి హెచ్ఎం మల్లేశం, తాండూర్ హెచ్ఎం డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జోనల్ పోటీలకు ఎంపికైన విజేతలు వీరే....

విద్యార్థులు ప్రతిభ చూపి జోనల్ పోటీలకు ఎన్నికైనట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పి పరిమళ తెలిపారు. బాలికల అండర్14లో ఎం హర్షిత, వర్ష, లక్ష్మి, శ్రావణి, ఆలియా మెహటీన్, అంజలి, నవ్య, మహాలక్ష్మి, ప్రసన్న, రుచిత, అమూల్య, నిహర్షిత, ప్రణవీ, బాలుర అండర్14లో వెంకటేష్, అన్వేష్, సుశాంత్, అంజి, మణిశ్వర్, రాము, ఉదయ్, హర్షిత్, గణేష్ కుమార్, అద్విక్, దిలీప్, రిత్విక్, మహిక్షిత్, అభిరామ్, మన్విత్, శివ కేశవ్ ఎంపికైనట్లు పేర్కొన్నారు.

చేతిలో చిప్ప..చెవిలో పువ్వుతో నిరసన



నవతెలంగాణ-రెబ్బెన

ప్రభుత్వ తీరును ఎండగట్టుతూ మధ్యాహ్న భోజన కార్మికులు చేతిలో చిప్ప, చెవిలో పువ్వు పెట్టుకొని నిరసన తెలిపారు. 8 రోజులుగా సమస్య పరిష్కరం కోసం సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందించడం లేదని మండిపడుతున్నారు. వీరికి సీఐటీయూ సింగరేణి కాంట్రాక్టు కార్మికుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ ఓదెలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులు న్యాయపరమైన డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న ప్రభుత్వం మాత్రం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. పెంచిన వేతనాలను, పెండింగ్ బిల్లులను విడుదల చేయకుండా కార్మికులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. కార్మికులతో చర్చలు జరిపి డిమాండ్లను పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పాగిడి మాయ, ఆర్.విజయ, సుజాత, హసీనా, పోశవ్వ, తానుబాయి, గోత్రె లక్ష్మీ పాల్గొన్నారు.

మాజీ కేంద్రమంత్రి కాక జయంతి



నవతెలంగాణ-తాండూర్

మాజీ కేంద్ర మంత్రి, దివంగత గడ్డం వెంకట స్వామి(కాకా) 94వ జయంతిని పురస్కరించుకోని బీజేపీ నాయకులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం బెల్లంపల్లి మండల అధ్యక్షులు గజెల్లి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ కంటి ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఆయన చేసిన సేవలను కొనియాడుతూ నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షులు పట్టి వెంకటక్రిష్ణ అసెంబ్లీ కన్వీనర్ రచార్ల సంతోష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రెవెల్లి రాజలింగు, కన్నాల మాజీ సర్పంచ్ మంద అనిత, మండల ప్రధాన కార్యదర్శులు నగేష్, గంగారామ్, నాయకులు రాములు, సబ్బాని రాజనర్సు పాల్గొన్నారు.

లంబాడితండా(డి) పంచాయతీ తనిఖీ

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని లంబాడితండా(డీ) గ్రామపంచాయతీని గురువారం డీపీఓ ఫణిందర్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. సానిటేషన్ పనులపై అలసత్వం వహించవద్దని, కంపోస్టు తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి కే నాగరాజు, సర్పంచ్ అజ్మీర తిరుపతి, పంచాయతీ కార్యదర్శి ఎం రజిత పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎస్ఆర్ఎస్ యూత్ చేయూత



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని డబ్బా గ్రామపంచాయతీ పరిధిలో గల ధరంపల్లి గ్రామానికి చెందిన లొంబాడి పునాజీ ఏడు సంవత్సరాల క్రితం చనిపోయాడు. భర్త చనిపోవడంతో కమల తన ఇద్దరు పిల్లలను కూలీ పనులు చేసుకుంటు పోశిస్తుంది. విషయం తెలుసుకున్న శివరామ సాయి యూత్ వెల్ఫేర్ సొసైటి యూత్ సభ్యులు వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గురువారం బాదిత కుటుంబం ఇంటికి వేళ్లి రూ. మూడు వేల నగదు ఆర్థిక సాయం ఎస్సై వెంకటేష్ చేతుల మీదుగా అందించారు. పిల్లల చదువు బాద్యత తీసుకుంటామంటూ వారికి బ్యాగు, నోట్ బుక్స్, పెన్నులు, ప్యాడ్స్, నీళ్ల బాటిల్స్, డ్రెస్సులు, దుప్పట్లను అందించారు. కుటుంబానికి అండగా నిలిచిన యూత్ సభ్యులను ఎస్సై అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎస్ యూత్ యూత్ అధ్యక్షులు గుర్లే శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తూమోజు వెంకటేష్, కోశాధికారి గుర్లే అశోక్, ఉపాధ్యక్షులు నికొడే సందీప్, బోర్లే పురుషోత్తం, యూత్ సభ్యులు నరేందర్, బరిగల శంకర్, మోయిన్, లక్ష్మణ్ గౌడ్, ఉపాధ్యాయులు సురేష్, రాజమౌళి, దేవరావు పాల్గొన్నారు.

సింగరేణి సంస్థ యువతను ప్రోత్సహిస్తుంది : రవిప్రసాద్

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి ప్రభావిత ప్రాంతాల అభివృద్ధే కాకుండా సమీప గ్రామాల నిరుద్యోగ యువత ప్రభుత్వ కొలువులు సాధించేందుకు సింగరేణి సంస్థ అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందని బెల్లంపల్లి ఏరియా జీఎం డి రవిప్రసాద్ అన్నారు. గురువారం జీఎం కార్యాలయం ఆవరణలో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన యువతీ, యువకులను అభినందించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కానిస్టేబుల్, ఎస్సై శిక్షణను సద్వినియోగం చేసుకొని తొమ్మిది మంది యువకులు, ఇద్దరు యువతీలు కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారన్నారు. రాత పరీక్షల సాధన కోసం సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. పరిసర ప్రాంతాల యువత కోసం మైదానం, గ్రంథాలయంలో మరిన్ని వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం తిరుమల రావు, డీవైపీఎం రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఉద్య యాదవ మహాసభను జయప్రదం చేయాలి

- రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు చిక్కాల రవికిరణ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈనెల 8న హైదరాబాద్ నాగోల్ శుభం కన్వెన్షన్ హాల్లో జరిగే ఉద్య యాదవ మహాసభను జయప్రదం చేయాలని ఉద్య యాదవ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు చిక్కాల రవికిరణ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సాయి వైకుంఠ ట్రస్ట్ కార్యాలయంలో ఉద్య సభ్యులతో కలిసి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభలో యాదవుల అభివృద్ధి గురించి చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా ప్రముఖ హోమియోపతి వైద్యులు డా. రవికిరణ్ యాదవ్ హాజరు కానున్నట్లు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తమిళనాడు రాష్ట్రాల నుంచి విద్యా కమిటీ సభ్యులు హాజరవుతారని పేర్కొన్నారు. అలాగే ఆదిలాబాద్ జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ పోస్టర్ల విడుదలలో సభ్యులు నవీన్ యాదవ్, మట్ట శ్రీనివాస్, ఆశన్న, రామన్న స్వప్నిల్, మహేందర్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మున్సిపల్ చైర్మన్ జోగుప్రేమేందర్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో టీఎన్జీవోస్ అనుబంధ మున్సిపల్ ఉద్యోగుల యూనియన్ ఏర్పాటుకు గురువారం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా టీఎన్జీవోస్ అధ్యక్షుడు అశోక్ హాజరయ్యారు. యూనియన్ అధ్యక్షులుగా జాదవ్ కృష్ణ, ఉపాధ్యక్షులుగా ఓరుగంటి వెంకటేష్, కార్యదర్శి నుస్రత్ ఖాన్‌లతో పాటు పదిహేను మందితో కూడిన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని మున్సిపల్ చైర్మన్ సత్కరించి అభినందనలు తెలిపారు. టీఎన్జీవోస్‌కు అనుబంధంగా మున్సిపల్ యూనియన్‌ను ఏర్పాటు చేయడం పట్ల చైర్మన్ అభినందనలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంఘాలు కృషి చేయాలనీ సూచించారు. దేశంలోని మరే ఇతర రాష్ట్రంలో లేని విధంగా ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణలో వేతనాలు అందిస్తున్నామని, ఇప్పటికే ప్రభుత్వం మూడు సార్లు పీఆర్సీని ఇచ్చిన విషయాన్నీ గుర్తుచేశారు.

క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట



నవతెలంగాణ-ముథోల్

తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న బతుకమ్మ చీరలు, స్పోర్ట్స్ కిట్స్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణస్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించడంలో భాగంగా వివిధ స్థాయిల్లో క్రీడా పోటీలను నిర్వహిస్తుందని వెల్లడించారు. అదేవిధంగా క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడానికి ప్రభుత్వం స్పోర్ట్స్ కిట్స్‌లను పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా నిర్వహించుకునే బతుకమ్మ పండుగను ఆడపడుచులు సాంప్రదాయబద్ధంగా నిర్వహించుకునేందుకు చీరలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని వెల్లడించారు. ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతుందని తెలిపారు. మండలంలోని సరస్వతి నగర్ గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రెండు లక్షల 50 వేల ప్రొసీడింగ్ కాపీను సంఘ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహమ్మద్ అతికొద్దీన్, ఎంపీడీఓ సురేష్‌బాబు, ఎంపీపీ అయేష అఫ్రోజ్ ఖాన్, వైస్ ఎంపీపీ లావణ్య రవీందర్‌రెడ్డి, సర్పంచులు వెంకటపూర్ రాజేందర్, రామ్‌చందర్, సాయినాథ్, అశ్విని మైసాజి, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ సాయిరాం, ఎంపీటీసీ సరళ శ్రీనివాస్ గౌడ్, కోఆప్షన్ సభ్యుడు ఖాళీద్, ఏపీఎం గురుచరణ్, పీఏసీఎస్ మాజీ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ పోతన్న యాదవ్, నాయకులు గౌతం, మహిళా సంఘం అధ్యక్షురాలు, ఐకేపీ సీసీలు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

అండర్ వంతెన బదులు పై ఓవర్ నిర్మించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని జందాపూర్‌తో పాటు 40 గ్రామాలకు వెళ్లే రోడ్డు మార్గంలో గల రైల్వే ట్రక్ పై అండర్ వంతెన బదులు పై ఓవర్ వంతెనను నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. గురువారం జందాపూర్ గ్రామస్తులతో పాటు వివిధ గ్రామాల ప్రజలు సైతం ముక్తకంఠంతో అండర్ బ్రిడ్జి వద్దని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వంతెన నిర్మాణం కోసం గ్రామపంచాయతీ నుంచి ఎన్ఓసీ తీసుకునేందుకు వెళ్లిన రెవెన్యూ, రైల్వే శాఖ ఉద్యోగులతో ఈ విషయాన్ని గ్రామస్తులు వారి దృష్టికి తీసుకెళ్లారు. అక్కడికి చేరుకున్న ఆర్డీఓ స్రవంతికి పై ఓవర్ వంతెన నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు తీర్మాణం చేసి అందజేశారు. ఈమె వెంట ఆదిలాబాదు రూరల్ తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ ఉల్లాస్, రైల్వే శాఖ డీఈ, గ్రామస్తులు ఉన్నారు.

బీమాతోనే కుటుంబానికి ధీమా



నవతెలంగాణ-ఇచ్చోడ

ప్రతి వ్యక్తి బీమా ఉంటే కుటుంబానికి కొండతా ధీమా ఉంటుందని ఆదిలాబాద్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ వంగ కార్తీక్ అన్నారు. గురువారం మండలంలోని ముక్రా(కె) గ్రామానికి చెందిన మెంటేల్కర్ శ్రీకాంత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఎస్బీఐ ఇన్సూరెన్స్ నుంచి మంజూరు అయిన రూ.20లక్షల చెక్కును మృతుని భార్యకు బ్యాంకు అధికారులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ముక్రా(కె) గ్రామానికి చెందిన మెంటేల్కర్ శ్రీకాంత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శ్రీకాంత్‌కు ముగ్గురు పిల్లలు, భార్య, తల్లి ఉన్నారు. మృతుడు ఎస్బీఐ ఇన్సూరెన్స్‌లో స్మార్ట్ స్కాలర్ చైల్డ్ పాలసీ చేయడంతో మృతుడి భార్యకు ఇన్సూరెన్స్ కింద రూ.20 లక్షల చెక్కును అందించారు. మిగిలిన ప్రీమియాన్ని బ్రాంచ్ వారే చెల్లిస్తూ, పాలసీ మెచ్యూరిటీ సమయంలో మొత్తం డబ్బులను పిల్లలకు చెల్లిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ కార్తిక్ కుమార్, సీనియర్ ఏజెన్సీ మేనేజర్ సురేష్ నాయక్, లైఫ్ మిత్ర జాదవ్ నారాయణ, ఇతర లైన్ మిత్రా బృందం పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలి

నవతెలంగాణ-నార్నూర్

ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో నిర్వహించిన సంకల్ప సప్తహ కార్యక్రమంలో భాగంగా మాట్లాడారు. అధికారులు ముందుగా మూడో రోజు పారిశుధ్యంపై ప్రజలకు వివరించారు. విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రతగా పాటించాలని ప్రతిజ్ఞ చేశారు. తడి పొడి చెత్తను బయటకు పారేయకుండా వేర్వేరుగా ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు తరలించాలని అన్నారు. గ్రామాన్ని స్వచ్ఛత దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కావల రమేష్, ఎంపీఓ మహేష్, ఏఓ రమేష్, సర్పంచ్ రాథోడ్ మధుకర్, ఉపసర్పంచ్ విష్ణు, కార్యదర్శి కొల శేఖర్ ఉన్నారు.

కానిస్టేబుల్ ఫలితాల్లో మెరిసిన మండల విద్యార్థులు

- ఉప సర్పంచ్ అందించిన శిక్షణలో 13 మందికి ఉద్యోగాలు
- భీమ్ స్టడీ సర్కిల్లో 5 మంది విద్యార్థులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాలలో మండల విద్యార్థులు సత్తా చాటారు. సివిల్, ఏఆర్, ఎక్సైజ్, టీఎస్ఎస్పీకి సంబంధించిన కానిస్టేబుల్ ఫలితాలు బుధవారం సాయంత్రం విడుదల చేయగా మండలంలో 40 కి పైగా యువత ఉద్యోగాలు సాధించారు.

ఉప సర్పంచ్ అందించిన శిక్షణలో 13 మందికి ఉద్యోగాలు

మండలంలోని బూరుగూడ గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ ఉన్న బుజాడి కుమార్ ఒలంపిక్స్‌లో పాల్గొనడం లక్ష్యంగా రన్నింగ్ నేర్చుకున్నారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైనప్పటికీ అనుకున్న లక్ష్యాన్ని సాధించకపోవడంతో ప్రజలకు సేవ చేయాలని రాజకీయాల్లోకి వచ్చారు. ఇదే సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వడంతో మండలంలోని 51 మంది యువతకు గ్రామ సమీపంలోని చేనులో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ అందించాడు. ఇందులో 13 మంది ఉద్యోగానికి ఎంపిక కావడంతో గ్రామ ప్రజలు కుమార్ సేవలను కొనియాడుతున్నారు. బూరుగుడ గ్రామానికి చెందిన గోలెం ఉమామహేష్, బుజాడి నరేష్, సైదం సునీత, కైరగాంకు చెందిన నామనీ శ్రావణ్, చిరకుంటకు చెందిన ఆడే సౌందర్య సివిల్ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. అదే గ్రామానికి చెందిన శ్రీశైలం ఏఆర్ కానిస్టేబుల్ కు, తులసి రామ్, రహపెల్లికి చెందిన ఇడిదనేని రామ్మూర్తి, కత్తర్సాల జగదీష్ టీఎస్-ఎస్పీకి, ఆసిఫాబాద్‌కు చెందిన దుర్గం జగదీష్ ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. అభ్యర్థులు ఎంపిక కావడం పట్ల కుమార్ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

కుమరం భీమ్ స్టడీ సర్కిల్ నుండి ఐదుగురు ఎంపిక

గిరిజన యువతకు శిక్షణ ఇచ్చే ఉద్దేశంతో ఎమ్మెల్యే ఆత్రం సక్కు కృషితో ఏర్పాటు చేసిన కొమరం భీమ్ స్టడీ సర్కిల్‌లో 23 మంది విద్యార్థులకు నిర్వాహకులు ఊషన్న, రాజశేఖర్‌లు కానిస్టేబుల్ శిక్షణ అందించారు. వీరిలో తాజాగా విడుదలైన ఫలితాల్లో 5 మంది ఉద్యోగాలు సాధించారు. ఇదిలా ఉంటే గతంలో సెంట్రల్ కానిస్టేబుల్‌గా 1 విద్యార్థి ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఎమ్మెల్యే ఆత్రం సక్కు, నిర్వాహకులు అభినందనాలు తెలిపారు.

కానిస్టేబుల్‌గా ఎంపిక కావడం సంతోషంగా ఉంది

- మొహమ్మద్ ఇర్ఫాన్, ఆసిఫాబాద్



కానిస్టేబుల్‌గా ఎంపిక కావడం సంతోషంగా ఉంది. ప్రభుత్వ ఉద్యోగం లక్ష్యంగా గత రెండు సంవత్సరాల నుండి వివిధ రకాల పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్నాను. తల్లిదండ్రులు సుల్తానా, మహమ్మద్ రజబ్‌తో పాటు అన్నయ్య ఇసాక్ సహకరించారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే తపన కళాశాల స్థాయి నుండి ప్రారంభమైంది.

ఎమ్మెల్యే, నిర్వాహకుల ప్రోత్సాహంతో విజయం సాధ్యమైంది

- పెందూర్ అంబుతాయి, పాటగూడ, బేల మండలం.



ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని తపన ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంతంలో ఉండడంతో ప్రోత్సహించేవారు లేక ఇబ్బంది పడ్డా. ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఆధ్వర్యంలో స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయడంతో ఆసిఫాబాద్ వచ్చాను. ఇక్కడికి వచ్చిన తర్వాత నిర్వాహకులు నిరంతరం మాకు ప్రోత్సాహం అందిస్తూ ఉద్యోగం సాధించేలా చేశారు. వారందరికీ రుణపడి ఉంటాను.

సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాడుతాం



- కలెక్టరేట్ వద్ద భారీగా తరలొచ్చి ఆశాల ఆందోళన
- కలెక్టరేట్ ముట్టడించి.. అదనపు కలెక్టర్‌కు వినతి
- ఎమ్మెల్యేలను, మంత్రులను అడ్డుకుంటాం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆశా కార్యకర్తలకు ఫిక్స్ వేతనం రూ.18.వేలు చెల్లించాలని, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని 11వ రోజు సమ్మెలో భాగంగా కలెక్టరేట్ ముట్టడికి గురువారం సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. దీంతో పోలీసులు ఆయా మండలాల నుంచి వచ్చే ఆశ కార్యకర్తలను ముందుగా అడ్డుకొని అరెస్టు చేశారు. ఇటీవల అంగన్‌వాడీలు చేపట్టిన కలెక్టరేట్ ముట్టడిలో పోలీసులకు నిరసన కారులకు తోపులట జరుగగా పలువురికి గాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తుగా కలెక్టర్ వద్ద భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సమ్మె శిబిరం నుండి వందలాది ఆశ కార్యకర్తలు కలెక్టరేట్‌కు ర్యాలీకి తరలివెళ్లారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైటాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. కలెక్టర్ రావాలి రావాలి అంటూ నినాదాలు చేస్తూ అక్కడే రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ 11 రోజులుగా నిరవధిక సమ్మె చేపడుతున్న ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ఆశాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందుకు ఎమ్మెల్యే, మంత్రులను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో ఆశ వర్కర్లకు వేతనం రూ. 18 వేలు నిర్ణయించి పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, పర్మినెంట్ బెనిఫిట్స్ తదితర డిమాండ్లను పరిష్కారించాలన్నారు. గతంలో 106 రోజుల సమ్మె చేశారని, కలెక్టర్, డీఎంహెచ్ఓ ఆఫీసు ముందు అనేకసార్లు ధర్నాలు చేశారని, రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర కూడా నిర్వహించారని గుర్తు చేశారు. ఇంకా అనేక రూపాల్లో శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేపట్టిన ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదన్నారు. రాష్ట్రంలో ఆశ వర్కర్లు గిరిజన ప్రాంతంలో 32 సంవత్సరాలు, మైదాన ప్రాంతంలో 18 సంవత్సరాల నుండి పని చేస్తున్నారన్నారు. వీరంతా బడుగుబలహీన వర్గాలకు చెందిన వారని, ప్రభుత్వం నిర్వహించే అనేక ట్రైనింగులు పొందుతారన్నారు. కరోనా నియంత్రించడంలో ఆశ వర్కర్లు కీలక పాత్ర పోషించారని, ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్ఓ) హెల్త్ గ్లోబల్ లీడర్స్ అని ఆశ వర్కర్లకు అవార్డును కూడా ప్రకటించిందని తెలిపారు. గతంతో పోలిస్తే ఈ కాలంలో ఆశ వర్కర్లకు పని భారం విపరీతంగా పెరిగిందన్నారు. ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యను పరిష్కరించేంత వరకు సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అనంతరం నిరసన కారుల దగ్గరకు జిల్లా అదనపు కలెక్టర్ శ్యామదేవి వచ్చి ఆశ కార్యకర్తలతో, నాయకులతో మాట్లాడారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షులు శోభ, జిల్లా కార్యదర్శి ఎం.సుజాత, నాయకులు జ్యోతి, లక్ష్మి, స్వప్న, పద్మ జ్యోతి, సునీత, అనిత, రాధ పాల్గొన్నారు

ప్రాంగణ నియామకాల్లో ఆర్జీయూకేటీ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-బాసర

ఆర్జీయూకేటీ యూనివర్సిటీ విద్యార్థులు ప్రాంగణ నియమకాలలో సత్తా చాటుతున్నారని వైస్ ఛాన్స్‌లర్ వెంకటరమణ అన్నారు. గురువారం వైస్ ఛాన్స్‌లర్ వెంకటరమణ మాట్లాడుతూ వారం రోజుల్లో రెండు సంస్థల్లో 8 మంది విద్యార్థులు, రూ.15లక్షల గరిష్ట వేతనంతో కొలువులు సాధించారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదివి సాధించిన విజయాలు మిగతా విద్యార్థులకు ఒక ప్రేరణగా నిలుస్తారని అన్నారు. యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు పలు సంస్థలు మౌఖిక పరీక్షలు నిర్వహించి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయని అన్నారు. మరిన్ని కంపెనీలు ప్రాంగణ నియమాకాల కొరకై ఆర్జీయూకేటీ బాసరకు వస్తున్నాయని, ఉద్యోగం సాధించిన విద్యార్థులకు వైస్ ఛాన్స్‌లర్ అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సతీష్ కుమార్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ హరిబాబు, సృజన డాక్టర్ ఎస్.విజయ్ కుమార్ మద్దెల నరేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలి



నవతెలంగాణ-ఇచ్చోడ

7వ జోనల్ లెవెల్ గేమ్స్‌లో క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని గురుకులం సొసైటి స్పోర్ట్స్ ఆఫీసర్ రవి కుమార్ అన్నారు.గురువారం మండల కేంద్రంలోని గిరిజన బాలికల పాఠశాలలో స్పోర్ట్స్ మీట్ పోటీలు ఈ నెల 13 నుంచి 15 వరకు 3 రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గ్రౌండ్, ట్రాక్ సంబంధించిన పనులను, క్రీడాకారులకు ఏర్పాటు చేయాల్సిన సదుపాయాలను, గురుకులం సొసైటి స్పోర్ట్స్ ఆఫీసర్ రవి కుమార్ ఆర్సీఓ గంగాధర్, జోనల్-1 స్పోర్ట్స్ ఆఫీసర్ శ్రీనివాస్, స్పోర్ట్స్ ఆఫీసర్ వీర్యానాయక్ కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. స్పోర్ట్స్ మీట్ సంబంధిత సమగ్ర వివరాలు స్థానిక ప్రిన్సిపాల్ రత్న కుమారిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కాంతరావు, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ అశ్విని, పీడీ, పీఈటీలు నందిని, గంగామణి, లత, ప్రతాప్ పాల్గొన్నారు.

కైతి లబానాలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కైతి లబానా (మధురా)లను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు థాన్ సింగ్ నాయక్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చెల్లప్ప కమిషన్ రాష్ట్రానికి వచ్చి కైతి లబాన (మధురా)ల జీవన విధానాలను తెలుసుకొని, ప్రభుత్వానికి ఓ నివేదికను సమర్పించిందని అన్నారు. కైతి లబానా (మధురా)లను ఎస్టీ జాబితాలో చేర్చాలని పేర్కొందని అన్నారు. దాన్ని విస్మరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కైతీ లబానాలను చేర్చుకోలేదన్నారు. లంబాడాలు, కైతి లబానాలు ఒక్కటేనని ఇద్దరినీ వేరు చేసి రాష్ట్ర ప్రభుత్వాలు పాలిస్తున్నాయన్నారు. జీఓ నెంబర్ 245ను అమలులోనికి తేవాలన్నారు. రెండు రోజులలో తమ సమస్యలను పరిష్కరించుకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో సీఎం కేసీఆర్‌పై 1116మంది, 9మంది ఎమ్మెల్యేలపై 116మంది ఇండిపెండెంట్ అభ్యర్థులను పోటీ చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కైతి లబానా (మధురా)సంఘం నాయకులు బంతిలాల్, అమర్‌సింగ్, బిసన్ సింగ్, చందానాయక్, రత్తినాయక్, బద్దు సింగ్, గోపాల్‌సింగ్ పాల్గొన్నారు.

9న గ్రామీణ కిసాన్ మేళాను విజయవంతం చేయండి

నవతెలంగాణ-తాండూర్

ఈనెల 9 నుండి మూడు రోజుల పాటు కరీంనగర్ పద్మనాయక కల్యాణ మండపంలో జరిగే కిసాన్ గ్రామీణ మేళాను నిర్వహించనున్నట్లు పశు వైద్యాధికారి భూమన్న తెలిపారు. ఇందులో డెయిరీ, మత్స్యకారులు, గొర్రెల పెంపకం, పౌల్ట్రీ రంగాలలో ఉపాధి పొందేందుకు అవకాశాలు తదితర వాటిపై అవగాహన కల్పిస్తారన్నారు. రైతులు కిసాన్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్తా సందర్శించారు. ప్రభుత్వం విద్యార్థులకు అల్పాహార మెనూ ప్రకారం అందించాలని అదనపు కలెక్టర్ సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు చూడాలని సూచించారు. అనంతరం ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు కార్యాలయ సిబ్బంది ఆమెను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ప్రణీత, ఎంపీడీఓ సుశీల్ రెడ్డి, మిషన్ భగీరథ జేఈ సునీల్, పీఆర్ జేఈ నర్సింగ్, ఎంపీపీ తుల శ్రీనివాస్, ఐసీడీఎస్ సీడీపీఓ సౌదర్య నాయకులు శ్రీధర్ రెడ్డి, విజయ్, జుగాది రావు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటను ధ్వంసం చేసిన అడవి పందులు

- నష్టపోయిన రైతుకు పరిహారం అందించాలి
- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఇప్ప లక్ష్మణ్



నవతెలంగాణ-కుభీర్

మొక్కజొన్న పంటను అడవిపందులు ధ్వంసం చేయడంతో నష్టపోయిన రైతుకు న్యాయం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఇప్ప లక్ష్మణ్ అన్నారు. గురువారం ధ్వంసమైన మొక్కజొన్న పంటను ఆయన సందర్శించారు. మండలంలోని హల్ద గ్రామానికి చెందిన రైతు సాయరెడ్డి 4ఎకరాల్లో మొక్క జొన్న పంటను సాగుచేశారు. గత మూడు, నాలుగు రోజుల నుంచి మొక్క జొన్న పంటలను అడవి పందులు పంటను పూర్తిగా ధ్వంసం చేశాయి. దాదాపుగా 2ఎకరాలకు పైగానే అడవి పందులు పూర్తిగా మొక్క జొన్న పంటను నెలపాలు చేశాయి. ఈ సందర్భంగా రైతు సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రభుత్వం నష్టపోయిన రైతుకు నష్టపరిహారం అందించేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా సంబంధిత అటవీశాఖ అధికారులు, రెవెన్యూ, వ్యవసాయశాఖాధికారులు వెంటనే, నష్టపోయిన రైతుకు నష్టపరిహారం అందించేలా కృషి చేయాలని కోరారు.

ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా గ్రూప్-1 రద్దు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతుందని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జిల్లా కన్వీనర్ అక్షయ్ ఆరోపించారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా గ్రూప్-1 రద్దైందని ఆరోపిస్తూ గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. అనంతరం రోడ్డుపై బైటాయించి నినాదాలు చేసి ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేయడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అక్షయ్ మాట్లాడుతూ ప్రభుత్వానికి ఉద్యోగాలు భర్తీ చేయాలనే ఉద్దేశం లేదని, ఎన్నికలు దగ్గరకొస్తున్నాయనే కారణంతో ఓటు బ్యాంకు కోసం అడప, దడప నోటిఫికేషన్లు ఇస్తూ పేపర్ లీకేజీలతో కుట్రపూరితంగా నిరుద్యోగుల జీవితాలను రోడ్డుకి ఇడుస్తున్నారని మండిపడ్డారు. ప్రశ్న పత్రాల్లో తప్పులు దొర్లే విధంగా వ్యవహరించడం ఏదో ఒక రకంగా కోర్టు ద్వారా పరీక్షను రద్దు చేయించి ఉద్యోగాల భర్తీని ఆపడం కోసం చేస్తున్న కుట్ర మరోసారి తేటతెల్లమైంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు ఉన్నారు.

స్టడీ సర్కిల్ నుంచి 46 మందికి ఉద్యోగాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాకు చెందిన 90 మంది పోలీసు అభ్యర్థులు ఉచిత శిక్షణ పొందగా 46 మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ఇందులో 33 మంది పురుషులు 13 మంది మహిళలు ఉన్నారు. 20 మంది సివిల్ కానిస్టేబుల్, 22 మంది ఏఆర్ కానిస్టేబుల్, 13 మంది టీఎస్పీఎస్పీ బెటాలియన్ కానిస్టేబుల్, ఒకరు జైలు వార్డెర్ కానిస్టేబుల్‌కు ఎంపికయ్యారు. పట్టుదల, క్రమశిక్షణ, తీవ్రతపన, నిపుణులైనటువంటి అధ్యాపకబృందం చేత శిక్షణ ఇవ్వడం, 24 గంటల లైబ్రరీ, స్టడీ హాల్ సౌకర్యం ఉండటం వలన ఎక్కువ మంది అభ్యర్థులు విజయం సాధించారని బీసీ సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి రాజలింగు ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్‌ను అభినందించారు.

ఆశా వర్కర్ల కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం

- జిల్లా వైద్యాధికారికి వినతిపత్రం అందజేత
- నాయకులు, ఆశా వర్కర్ల అరెస్ట్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆశ వర్కర్లు తమ డిమాండ్ల పరిష్కారం కోసం సీఐటయూ ఆధ్వర్యంలో చేస్తున్న నిరసనలో భాగంగా గురువారం చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. సీఐటీయూ పిలుపులో భాగంగా జిల్లాలోని వివిధ మండలాల్లో పనిచేస్తున్న ఆశ కార్యకర్తలు పెద్ద ఎత్తున కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకున్నారు. జిల్లా వైద్యాధికారి తుకారాం భట్ కలెక్టరేట్ కార్యాలయం వద్దకు చేరుకొని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ తమ సమస్యల ముందు అవేవి పనిచేయలేదని, సమస్యలు పరిష్కరించాలని జిల్లా వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 26వేల మంది ఆశా వర్కర్లు పని చేస్తున్నారని, గత 18 ఏండ్లుగా పేద ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్నారని అన్నారు. ప్రతి రోజు ఉదయం నుంచి రాత్రి వరకు ఆశాలు పని చేస్తున్నారని అన్నారు. పనిభారం గతంతో పోలిస్తే అనేక రెట్లు పెరిగిందన్నారు. అయినప్పటికీ నేటికీ స్థిర వేతనం లేకపోవడం దారుణం అన్నారు. ఆశ వర్కర్లకు రూ.18 వేల వేతనాన్ని చెల్లిస్తూ, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో ఉద్యమాన్ని తీవ్రతరం చేయనున్నట్లు హెచ్చరించారు. పోలీసుల వాహనాన్ని కూడా ఆశ వర్కర్లు అడ్డుకున్నారు. కలెక్టరేట్ కార్యాలయంలోకి చొచ్చుక వెళ్లడానికి ప్రయత్నం చేసిన క్రమంలో నాయకులను అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆశ వర్కర్లు చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి విజయవంతం కావడంపై నాయకులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్, జిల్లా నాయకుడు వెలిశాల కృష్ణమాచారి, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షులు స్వరూప, ప్రధానకార్యదర్శి నగరం పద్మ, నాయకులు ఓమలా, కేసరా నవీన, రాజేశ్వరీ, రంభా, సక్రుబాయి, సునీత, బద్రుబాయి, అరుణా, కవితా, నిర్మలా, సుమలత, భాగ్య పాల్గొన్నారు.

పోరాట ఫలితంగానే సమ్మె డిమాండ్ల హామీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గత 24 రోజులుగా న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీ ఉద్యోగులు చేస్తున్న పోరాటం ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం మంత్రి తన్నీరు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్‌తో జరిగిన చర్చలు సఫలమయ్యాయి. ఈ సందర్భంగా గురువారం సీఐటీయూ కార్యాలయంలో విజయోత్సవ సభను నిర్వహించారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుని, డీజే పాటలకు నృత్యాలు చేస్తూ సంబురాలు నిర్వహించుకున్నారు. సమ్మెలో కీలక పాత్ర పోషించినవారిని ఈ సందర్భంగా అభినందించారు. ఈ మేరకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ పీఆర్సీ కమిటీ వేయటం, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా 5శాతం ఐఆర్ వర్తింప చేయటం, పీఆర్సి ఫైనల్ చేసేటపుడు వేతనాలు పెంచుతామని చెప్పడం జరిగిందన్నారు. అలాగే రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ టీచర్స్‌కు రూ.2 లక్షలు, హెల్పర్స్‌కు రూ.1లక్ష పెంచుతామని చెప్పారని, ఆసరా పెన్షన్ వర్తింపజేస్తామన్నారు. 65 సంవత్సరాలలోపు రిటైర్‌మెంట్ కోరితే, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇస్తామని తెలిపినట్లు వివరించారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా కేంద్రం ఇప్పటికే అప్ గ్రేడ్ చేస్తూ గైడ్లెన్స్ ఇచ్చిందని అన్నారు. రాష్ట్రం కూడా గైడ్‌లైన్స్ ఇస్తామని ఈ సందర్భంగా తెలిపినట్లు పేర్కొన్నారు. రూ.7.2 లక్షల ప్రమాద బీమా సౌకర్యం అమలు చేస్తామని, సమ్మె కాలం వేతనాలు చెల్లిస్తామని చెప్పారని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, సహాయ కార్యదర్శి జితేందర్, పొచ్చన్న, రైతు సంఘం అధ్యక్షులు బండి దత్తాత్రి, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండఖ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు సునీత, జిల్లా అధ్యక్షులు వెంకటమ్మ, నాయకులు సునీత, పార్వతి, పద్మ, ఐద్వా నాయకులు మంజుల పాల్గొన్నారు.

- సంబురాలు చేసుకున్న అంగన్‌వాడీలు



పాఠశాల విద్యార్థులకు గొడుగుల పంపిణీ

నవతెలంగాణ-జైపూర్

కాక అని పిలిపించుకున్న కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి 94వ జయంతిని పురస్కరించుకుని గురువారం వేలాల గ్రామంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గొడుగులు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ డేగ నగేష్ పటేల్ మాట్లాడుతూ బీజేపీ నాయకులు పెద్దపల్లి మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి తన తండ్రి వెంకటస్వామి జయంతిని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులకు ట్రస్టు ద్వారా గొడుగులు పంపించడం జరిగిందని తెలిపారు. విద్యార్థుల అవసరాలు తీర్చడం కోసం గొడుగులు పంపించిన వివేక్ వెంకటస్వామికి గ్రామస్తుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు మీసాల మల్లయ్య, బీజేపీ నాయకులు ప్యాగ లవకుమార్, తడూరి రమేష్, బీజేవైఎం నాయకులు దుర్గం విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



డిస్మిస్ కార్మికులకు మళ్లీ అవకాశం

నవతెలంగాణ-మంచిర్యాల

సింగరేణిలో పనిచేస్తూ విధులకు గైర్హాజరై డిస్మిస్ అయిన ఉద్యోగులను తిరిగి నియామకం కోసం కంపెనీ తెలిపిన ప్రమాణాలు కలిగిన వారు హైపర్ కమిటీ రివ్యూ చేయడానికి దరఖాస్తు చేసుకోవాలని ఏరియా జీఎం బి సంజీవరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1జనవరి 2019 నుండి 31డిసెంబర్ 2022 వరకు అనధికారికంగా గైర్హాజరై డిస్మిస్ అయిన ఉద్యోగులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని బదిలీ వర్కర్ కేటగిరీ-1 నియామకం కోసం తెలిపిన ప్రమాణాలను కలిగి ఉండాలని తెలిపారు. 1 ఏప్రిల్ 2023 నాటికి 46 సంవత్సరాలు, అంతకంటే తక్కువ వయసు కలిగి ఉండాలని, డిస్మిస్ అయిన కాలానికి ముందు 5సంవత్సరాలలో ఏదైన 2సంవత్సరాలు కనీసం 100 మస్టర్లు కలిగి ఉండాలని, బదిలీ వర్కర్(యూజి) తిరిగి నియామకం కోసం మెడికల్ ఫిట్నెస్ కలిగి ఉండాలన్నారు. మాజీ ఉద్యోగులు దరఖాస్తులను 31 అక్టోబర్ 2023 లోగా గనుల మేనేజర్, ఏజెంట్, ఉన్నతాధికారులకు అందజేయాలని తెలిపారు.

బతుకమ్మ చీరలు, స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

నవతెలంగాణ-సారంగాపూర్

మండల కేంద్రంలో మహిళలకు బతుకమ్మ చీరలు, యువకులకు స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. గురువారం రైతుబంధు జిల్లా అధ్యక్షులు నల్ల వెంకట్ రామ్‌రెడ్డి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచులకు ప్రభుత్వం బతుకమ్మ చీరలు పంపిణీ, యువకులకు స్పోర్ట్స్ సామగ్రి పంపిణీ చేస్తుందని అన్నారు. క్రీడలతో యువతకు అన్నిరంగాల్లో అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. యువకులు చదువుతో పాటు నిత్య జీవితంలో క్రీడలను అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామిక వేత్త అల్లోల మురళీధర్ రెడ్డి, సొసైటీ చైర్మెన్లు నారాయణ రెడ్డి, మాణిక్ రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ ఆశ్రిత శ్రీనివాస్‌రెడ్డి, అడెల్లి ఆలయ చైర్మెన్ చందు, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీఓ సరోజ, ఎంపీఓ తిరుపతిరెడ్డి, అయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు గ్రామసర్పంచ్ సుజాత నర్సారెడ్డి, ఎంపీటీసీ పద్మ వీరయ్య, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్ : మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు 10379 మందికి బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. అనంతరం 52 మంది అబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అదేవిధంగా గ్రామ పంచాయతీలకు స్పోర్ట్స్ కిట్స్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అందిస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రాజారాం, స్థానిక సర్పంచ్ లావణ్య, ఎంపీటీసీ లక్కం తిరుమల పాల్గొన్నారు.

క్రీడలతో యువతకు మంచి భవిష్యత్తు

నవతెలంగాణ-జన్నారం

క్రీడలతో యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందని తపాలాపూర్ గ్రామ సర్పంచ్ నైనాల తిరుపతి అన్నారు. గురువారం ఆ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో క్రీడాకారులకు సీఎం క్రికెట్ కిట్టుతోపాటు క్రీడా సామాగ్రిని అందించారు. క్రీడలలో రాణించే వారికి త్వరగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరుకుతాయన్నారు. క్రీడాకారులు క్రీడలలో ప్రావీణ్యం సాధించి పోటీలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ రాజు, బీఆర్ఎస్ నాయకులు విజయ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రమేష్‌గౌడ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

చిప్ప పట్టుకొని మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన

నవతెలంగాణ-జన్నారం

సమ్మెలో భాగంగా మధ్యాహ్న భోజన కార్మికులు గురువారం తహసీల్దార్ కార్యాలయ ముందు చెవిలో పువ్వులు పెట్టుకొని చిప్ప పట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్షుడు బుచ్చయ్య, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం అధ్యక్షురాలు వసంత మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మె కొనసాగిస్తామన్నారు.

కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన పేదింటి ఆణిముత్యం

నవతెలంగాణ-కోటపల్లి

మండలంలోని ఆలుగామ గ్రామానికి చెందిన పేదింటి ఆణిముత్యం కానిస్టేబుల్ ఉద్యోగం సాధించింది. రామాటెంకి చిన్నన్న కూతురు సమ్మక చిన్ననాటి నుండి చదువుతోపాటు ఆటలలో ముందుండేది. నిర్మల్ జిల్లాలో జామ్ కళాశాలలో ఇంటర్, మంచిర్యాల టీఎస్‌డబ్ల్యూ ఆర్‌డిసి కళాశాలలో డిగ్రీ చేసింది. ఎలాంటి శిక్షణ లేకుండా కానిస్టేబుల్ ఉద్యోగాన్ని సాధించింది. తండ్రి వ్యవసాయం చేస్తూ పిల్లలను ఉన్నత చదువులు చదివించాడు. గ్రామంలో మొదటి పోలీసు ఉద్యోగం తన కూతురికే రావడం పట్ల ఆనందంతో గ్రామంలో స్వీట్లు పంచి సంతోషాన్ని వ్యక్తం చేశారు. సమ్మక్క కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చిందని గ్రామ ప్రజలు సమ్మక్కను అభినందిస్తున్నారు.

గొర్రెల పంపిణీలో అసత్య ప్రచారాలు వద్దు

నవతెలంగాణ-జన్నారం

గొర్రెల పంపిణీలో అవకతవకలు జరుగుతున్నాయని యాదవులే అసత్య ప్రచారాలు చేస్తున్నారని, అది నిజం కాదని యాదవ సంఘం జిల్లా డైరెక్టర్ గట్టు మహేష్, నరేష్ అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొంతమంది యాదవ సంఘం నాయకులు పనిగట్టుకొని పత్రికలలో కథనాలు రాయిస్తూ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం యాదవులకు అందించిన గొర్రెల పంపిణీలో ఏ ఒక్క వ్యక్తి ఏ అధికారికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. మరోసారి ఇలాంటి దుష్ప్రచారాలు చేస్తే వారిపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో యాదవ సంఘం నాయకులు యాదగిరి, తిరుపతి, వంగ శ్రీనివాస్, రేండ్ల గంగమల్లు, ఉడతల రవి పాల్గొన్నారు.

డ్రాయింగ్‌లో కుందారం పాఠశాల విద్యార్థుల రాణింపు

నవతెలంగాణ-జైపూర్

చదువుతో పాటు డ్రాయింగ్‌లో పాఠశాల విద్యార్థులు రాణిస్తున్నారని కుందారం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ తెలిపారు. హైదరాబాద్‌లో గల కాసుల చిత్ర కళ అకాడమీ వారు నిర్వహించిన ఇంటర్నేషనల్ ఆన్‌లైన్ డ్రాయింగ్‌లో పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. డ్రాయింగ్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తూ గురువారం వారికి సర్టిఫికెట్లు అందజేశారు. పాఠశాల ఆర్ట్ టీచర్ చిప్పకుర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు డ్రాయింగ్‌లో మెళకువలు తెల్సుకుని ఆన్‌లైన్‌లో నిర్వహించిన కాంపిటేషన్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రామకృష్ణ, లక్ష్మణ్‌రావు, లక్ష్మణ్, శోభ, సుజాత, జ్యోతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాలు అందేవిధంగా అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయం చేసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మెన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. గురువారం జిల్లా పరిషత్ కార్యాలయంలోని తన ఛాంబర్ లో స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మెన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలనీ అన్నారు. ఈ సమావేశాలలో జెడ్పీ సీఈఓ గణపతి, సంబంధిత స్థాయి సంఘ సమావేశాల సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.